

గీ..మోసం!

అంతా నేతి బీర చందమే

నేతి మిఠాయిలు.. నేతి పచ్చళ్లు.. నేతితో చేసిన పూతరేకులు.. నెయ్యి పేరు చెబితే చాలామంది ఫిదా అయిపోతారు.. ఎంత ధర అయినా పట్టించుకోరు.. కొనేస్తారు.. తినేస్తారు.. వ్యాపారులు తమ వ్యాపార విస్తరణకు ఇదే ట్రిక్ అమలు చేస్తున్నారు.. చాలాచోట్ల సక్సెస్ సాధిస్తున్నారు.. అయితే కొనుగోలుదారుడు మాత్రం ఆ వ్యాపారికి అంత నెయ్యి ఎక్కడి నుంచి వచ్చిందనేది కనీసం ఆలోచించకుండా కొనేస్తున్నాడు.. తినేస్తున్నాడు.. అనారోగ్యం పాలవుతున్నాడు.. ఆత్రేయపురం పూతరేకులు అంటే అంతా ఇంతా డిమాండ్ కాదు.. గురువారం అక్కడ 80 కిలోల కల్తీ నెయ్యి పట్టుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది..



- విచ్చలవిడిగా కల్తీ నెయ్యి
- పాడి తక్కువ..ఉత్పత్తి ఎక్కువ
- వినియోగంపై కుదరని పొంతన
- నూనె,డాల్డాతో నెయ్యి తయారీ
- పూతరేకులు, స్వీట్స్‌లో వాడకం
- దేవుడి దీపారాధనదీ ఇదే తీరు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇంకాస్త వెయ్.. అంటూ నెయ్యిని జుర్రుతున్నారా!.. ఆవకాయ పచ్చడిలో నెయ్యి ఉంటేనే గానీ ముద్ద దిగడం లేదా!.. నేతి మిఠాయిలను చూస్తే నోరూరిపోతోందా!.. ఇడ్లీ నానిపోయేలా నేతిని పోస్తున్నారా!.. అయితే ఈ కథనం మీ కోసమే. నేతి బీర పేరులో అయినా నెయ్యి ఉందేమోగానీ.. మనం వాడే నెయ్యిలో మాత్రం నెయ్యి 'నై'గానే ఉందని అధికారులు చేస్తున్న పరీక్షలు నిర్ధారిస్తున్నాయి. రంగు, వాసన, రుచి ఓకే.. కానీ అది నెయ్యేనా? అంటే సమాధానం ఠక్కున నీరుగారిపోవాల్సి వస్తోంది. ఇంట్లో ఓపిగ్గా తయారు చేసుకున్న నెయ్యిని జుర్రుకుంటే పర్వాలేదు. మార్కెట్‌ని ముంచెత్తుతున్న నెయ్యిని జాగ్రత్తగా గమనించి వాడకపోతే మాత్రం ఆరోగ్యం మన చేతుల్లోంచి జారుకున్నట్టే.

ఇదీ ఒక గృహిణి లెక్క..

నెయ్యి తయారీకి ప్రధాన ముడి సరుకు వెన్న. అది పాల నుంచే వస్తుంది. ఒక అరకిలో నెయ్యి తయారు కావాలంటే సాధారణ గృహిణి లెక్కల్లో చూసినా.. గేదె పాలు రోజుకు లీటరు చొప్పున చూసుకుంటే దానికి వచ్చే వెన్న సుమారు ఓ కోడిగుడ్డు పరిమాణం ఉంటుంది. అలా నెల రోజులైన తర్వాత మరిగిస్తే ఓ అరకిలో నెయ్యి తయారవుతుంది. కానీ రోజు రోజుకూ పాడి తగ్గుతున్నా నెయ్యి మాత్రం విరివిగా లభ్యమవుతూ కిలో రూ.250కే దొరికేస్తోంది. ఇది ఎలా సాధ్యమో అధికారుల విచక్షణతో ఆలోచించాలి..

కల్తీ నెయ్యి తయారీ ఇలా..

నెయ్యిని రకరకాల పద్ధతుల్లో కల్తీ చేస్తున్నారు. రసాయనాలతో తయారుచేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ కోలమూరులో 9 నెలల కిందట నెయ్యి తయారీ కేంద్రంలో సోదాలు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నివ్వెరపోయారు. వంట నూనెను వేడి చేసి డాల్డాను జోడించి నెయ్యి మాదిరిగా వాసన, రంగు కోసం కృత్రిమ రసాయనాలు కలుపుతున్నారని బయట పడింది. ఆవు నెయ్యి కాస్త తెల్లగా, గేదె నెయ్యి లేత గోధుమ రంగులో ఉంటుంది. ఆ రంగులు రావడం కోసం సింథటిక్ కలర్స్ కలుపుతున్నారు. ఇలాంటి నెయ్యిని వాడితే ఆరోగ్యానికి హానికరమని వైద్యులు చెబుతున్నారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యితో దీపాలు వెలిగిస్తే ఆరోగ్యం. కల్తీ నెయ్యితో దీపాలు వెలిగిస్తే వచ్చే పొగను పీల్చడం వల్ల వివిధ క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వినియోగమెంత..వచ్చేదెంత!

నెయ్యికి ముడి సరుకు అయిన పాల లెక్క చూస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 2 లక్షల ఆవులు, 6 లక్షల గేదెలు ఉంటాయి. వాటిలో 60 శాతం పాలిచ్చేవిగా భావించవచ్చు. ఒక గేదె ఒక రోజుకు 6 లీటర్ల పాలు ఇస్తోందని అనుకున్నా..అంతటికీ వెన్న తీయరు. గేదె పాలు స్వచ్ఛంగా ఉంటే 9%, ఆవు పాలల్లో సుమారు 4% వరకూ ఫ్యాట్ ఉంటుంది. సుమారు 2 లక్షల గేదె పాలు, 50 వేల ఆవు పాల నుంచి వెన్న సేకరించినా దాదాపు 10 టన్నుల వెన్న వస్తుంది. దాని నుంచి 20% నెయ్యి ఉత్పత్తి అనుకున్నా 2 టన్నుల నెయ్యి మాత్రమే ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. బయటి నుంచి వెన్న కొన్నా మరో 2 టన్నులకు మించి తయారుకాదు. కానీ డబ్బాలు డబ్బాల్లో టన్నుల కొద్దీ నెయ్యి విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రోజుకు నెయ్యి వాడకం ఎంత ఉంటుందనే విషయం లెక్కకు చిక్కదు. ముహూర్తాల సీజన్, కార్తీక మాసం వంటి నెలల్లో నెయ్యి వాడకం ఎక్కువగా ఉంటుంది.

ఉలిక్కిపడిన.. 'ఆత్రేయపురం'

పూతరేకులకు ఆత్రేయపురం పేరుగాంచింది. బెల్లం, పంచదార పొడితో పాటు నెయ్యి వేస్తేనే పూతరేకులకు రుచి వస్తుంది. దీంతో అధిక శాతం తయారీదారులు కల్తీ నెయ్యిని వినియోగిస్తున్నారు. ఆత్రేయపురంలో గురువారం 80 కిలోల కల్తీ నెయ్యిని పక్కా సమాచారంతో రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెయ్యిని ఆ వ్యాపారి ఎప్పటి నుంచో కిలో రూ.250కి పూతరేకుల తయారీదారులకు విక్రయిస్తున్నాడు. ఆ సొమ్ముకు స్వచ్ఛమైన గేదె నెయ్యి 100 ఎంఎల్ కూడా రాదు. ఒక్క ఆత్రేయపురంలోనే కాదు.. ఎక్కడ చూసినా నెయ్యిలో నాణ్యత మాత్రం కొరతగానే ఉంది.

తనిఖీ చేయాలని ఆదేశాలిచ్చాం..

నెయ్యి, నూనెల విషయంలో తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. అనుమానిత ప్రాంతాల్లో తరచుగా తనిఖీలు చేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. అనుమతులు పొందకుండా ఎక్కడైనా వాణిజ్య పరంగా తయారు చేస్తున్నారా? అనే విషయంపై నిఘా పెట్టాం. కల్తీ పదార్థాలపై సమాచారం ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

- శ్రీనివాస్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి తూర్పుగోదావరి

ఉమ్మడి జిల్లాలో 23 కంపెనీలు..

అధికారిక లెక్కల ప్రకారం.. కాకినాడ జిల్లాలో నెయ్యి తయారీకి 7, రీప్యాక్ 3, తూర్పుగోదావరిలో నెయ్యి తయారీకి 15, రీప్యాక్ 1, కోనసీమ జిల్లాలో తయారీకి 1, రీప్యాక్‌కి 2 కంపెనీలకు అనుమతులు ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 23 కంపెనీలు నెయ్యి తయారు చేస్తున్నాయంతే. అనుమతులు పొందకుండా వాణిజ్యపరంగా తయారు చేసే చిరు వ్యాపారులు 500 వరకూ ఉంటారని ఓ అంచనా. గతేడాది కాలంగా ఆహార భద్రత అధికారులు కాకినాడ జిల్లాలో 14 నమూనాలు సేకరించగా 3 నాణ్యత తక్కువగా ఉన్నట్టు.. ఒకటి అసలు వాడడానికి పనిచేయదని రిపోర్టులు వచ్చాయి. కోనసీమలో 2, తూర్పుగోదావరిలో ఐదులో 2 హానికరమైనవని తేల్చారు. అయినా చర్య లేవ్.. చట్టంలో ఉన్న లొసుగులు వ్యాపారులకు వరంగా మారాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు సరిపడా లేకపోవడం అనుకూలతగా మారింది. ఉమ్మడి తూర్పులో ఒక పర్యవేక్షణాధికారితో కలిపి కేవలం ఆరుగురు మాత్రమే ఫుడ్ సేఫ్టీ శాఖకు అధికారులు ఉన్నారు.వీరికి వాహనం ఉండదు. తూర్పుగోదావరి జిల్లాలో ఒకే ఒక్క అధికారి ఉన్నారు. దీంతో మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కల్తీ వ్యాపారం సాగిపోతోంది.

పన్ను పోటు తగ్గింది!





చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

- దిగిరానున్న హరిత పన్ను
- హామీ నెరవేర్చిన చంద్రబాబు
- జిల్లాలో లక్షలాది వాహనాలు
- 9 లక్షల మందిపై పన్నుపోటు
- 24.30 కోట్ల వరకు ఊరట
- గత వైసీపీలో బాదుడే బాదుడు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రజలను ఎడాపెడా పన్నులతో బాదేయడమే పనిగా పెట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం ఏటా వాహనదారుల నుంచి కోట్లలో పిండేసింది. హరితపన్ను పేరుతో రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. జేబులు గుల్లచేసేసింది. ఎట్టకేలకు ఈ హరితపన్ను దోపిడీ నుంచి వాహనదారులకు ఉపశమనం లభించింది. గత జగన్ పాలనలో వాహనాలపై రూ.20 వేల వరకు విధించిన హరితపన్ను రాష్ట్ర ప్రభుత్వం భారీగా తగ్గిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆయా వాహనాల కేటగిరీ ఆధారంగా రూ.1,500 నుంచి రూ.3 వేల వరకు మాత్రమే వసూలు చేయడానికి అంగీకరించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 9 లక్షల మంది వాహనదారులకు పన్ను బాదుడు తప్పనుంది. అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు ఉన్న లారీలకు భారీగా మేలు చేకూరబోతోంది.

రూ.200 నుంచి రూ.20 వేలకు..

గత టీడీపీ ప్రభుత్వంలో వాహనం రిజిస్ట్రేషన్ జరిగిన తేదీ నుంచి ఏడేళ్లు దాటితే రూ.200 వరకు మాత్రమే కట్టించుకునేవారు. అయితే కాలం చెల్లిన వాహనాలు తగ్గించే ఉద్దేశంతో కేంద్రం హరిత పన్నులు పెంచుకునేలా రాష్ట్రాలకు అవకాశం ఇచ్చింది. ఇదే అదనుగా గత వైసీపీ ప్రభుత్వం అన్ని రకాల వాహనాలపై 2022 జనవరి 1 నుంచి హరిత పన్నును భారీగా పెంచేసింది. అప్పటి వరకు ఉన్న రూ.200 పన్నును వివిధ శ్లాబ్‌లుగా విడదీసి లారీలు, టిప్పర్ల నుంచి రూ.20 వేల వరకు పిండేసింది. ప్యాసింజర్ వాహనాలు, స్కూలు, కాలేజీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్స్, ఓమ్నీ బస్సులు వంటి వాటికి రూ.6 వేలు, చివరకు ఆటోలు, బైక్‌లు, క్రేన్‌లు, ట్రాక్టర్లపైనా భారీగా పన్ను పెంచేశారు. పెరిగిన పన్ను భారం భరించలేక వీరంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు లారీలు ఉండగా వీటిపై కోట్లలో పన్ను భారం పడింది. కాకినాడ జిల్లా వరకు చూస్తే 2.94 లక్షల వాహనదారుల నుంచి జగన్ ప్రభుత్వం హరితపన్ను పిండేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు, కోనసీమ జిల్లాలో 1.80 లక్షల వాహనాలపై కలిపి కోట్లలో పన్నులను జగన్ ప్రభుత్వం పిండేసింది. ఏడేళ్ల, పదిహేనేళ్ల దాటిన కేటగిరీ పేరుతో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పన్నులు వసూలు చేశారు.

నాడు హామీ ఇచ్చి.. నేడు..

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రచారాలకు వెళ్లిన సమయంలో హరితపన్ను దోపిడీ నుంచి బయటపడేయాలని లారీ యజమానులు కోరారు. ప్రభుత్వం మారగానే పన్ను బెడద తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్నును తగ్గిస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. కేబినెట్ సైతం పన్ను తగ్గింపుపై తీర్మానం చేసింది. ప్రస్తుతం ఉన్న హరితపన్నును భారీగా తగ్గిస్తూ ఆయా వాహనాల కేటగిరీ, వయస్సు ఆధారంగా రూ.1,500 నుంచి రూ.3 వేల వరకు మాత్రమే వసూలు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఒకరకంగా చెప్పాలంటే రూ.24.10 కోట్ల వరకు ఉమ్మడిజిల్లా వాహనాలపై పన్ను భారం దిగనుంది. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 2.94 లక్షల వాహనాలపై రూ.9 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు వాహ నాలపై రూ.8.10 కోట్లు, కోనసీమలో 1.80 లక్షల వాహనాలపై రూ.7 కోట్ల వరకు పన్ను భారం తగ్గుతున్నట్టు అధికారులు అంచనా.



కొయంబత్తూరులో క్వాయర్ ఉత్పత్తుల కేంద్రాలను పరిశీలిస్తున్న అధ్యయన బృందం

కొబ్బరి ఉప ఉత్పత్తులపై అధ్యయనం

అమలాపురం టౌన్, మే23(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన క్వాయర్ అధ్యయన బృందం శుక్రవారం కొయంబత్తూర్ సమీపంలోని తిరుపూర్ కొబ్బరి ఉప ఉత్పత్తుల కేంద్రాలను పరిశీలించారు. ఆ ప్రాంతంలోని సుమారు 30 ఉత్పత్తుల తయారీ విధానాలను ఈ బృందం అధ్యయనం చేసింది. ప్రధానంగా ఎఫ్ఎక్స్ ఫ్యాక్టరీ వ్యవస్థాకులు, నిర్వాహకులతో సమావేశమై వర్జిన్ కోకోనట్ ఆయిల్, కోకోపిట్, మెన్యూర్ తదితర 30 ఉప ఉత్పత్తుల తయారీ విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ సాయినాథ్‌జైచంద్రగాంధీ, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవవర్మ, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ పాల్గొన్నారు.

పంచాయతీలకు కొత్త చూపు!

- జిల్లాలో 18 స్పెషల్ గ్రేడ్ పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- పంచాయతీ వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా తాజాగా గ్రేడింగ్‌లు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పంచాయతీల ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాలతో స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు త్వరలో రూపుదిద్దుకోనున్నాయి. పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనలతో పంచాయతీ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జనాభా, ఆదాయ ప్రాతిపదికన పంచాయతీల గ్రేడ్‌లు విభజించనున్నారు. పది వేల జనాభా రూ.కోటి పైగా ఆదాయం వచ్చే పంచాయతీలుగా ప్రభుత్వం గుర్తించడానికి కసరత్తు పూర్తిచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 63 స్పెషల్ గ్రేడ్ పంచాయతీలను ఏర్పాటుచేయడానికి ప్రతిపాదనలు సిద్ధంకాగా, వాటిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 18 పంచాయతీలు ఏర్పడనున్నాయి. వీటికి డిప్యూటీ ఎంపీడీవో హోదా కలిగిన అధికారిని నియమించనున్నారు. పంచాయతీల ప్రక్షాళన కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీ వీటిపై అధ్యయనం పూర్తి చేస్తుంది. ఈనెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి నివేదికలను అందించనున్నారు. నగర పంచాయతీలకు, గ్రామ పంచాయతీలకు మధ్యలోనే ఈ మార్పులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావన. గ్రేడ్-1, గ్రేడ్-1, గ్రేడ్-3లు కూడా ఈ మార్పుల్లో భాగంగా ఏర్పడనున్నాయి. వివిధ స్థాయిల్లో ఉన్న అధికారులను వీటికి నియమించనున్నారు. కాగా కోనసీమ జిల్లాలో 18 పంచాయతీల్లోని స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయి. దీనిలో భాగంగా మండల కేంద్రమైన రావులపాలెం, రాయవరం మండలంలో చెల్లూరు, రాజోలు మండలంలో తాటిపాక, మండపేట మండలంలో ద్వారపూడి, ఏడిద, కేశవరం, కొత్తపేట మండలంలో వానపల్లి, అల్లవరం మండలంలో కొమరగిరిపట్నం, అమలాపురం మండలంలో బండారులంక, పేరూరు, కామనగరువు, అంబాజీపేట మండలంలో మాచవరం, ఆత్రేయపురం మండలం ర్యాలీ, ఐ.పోలవరం మండలం కేశనకుర్రు, మండల కేంద్రమైన కాట్రేనికోన, పల్లంకుర్రులను స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా ఏర్పాటుచేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి.



ద్వారపూడి పంచాయతీ కార్యాలయం

గ్రేడ్‌ల కేటాయింపు ఇలా..

(మండపేట-ఆంధ్రజ్యోతి)

స్పెషల్ గ్రేడ్ పంచాయతీకి పది వేల జనాభా, రూ.కోటి ఆదాయం ఉండాలి. వీటిలో ఈవోపీఆర్‌డీ(డిప్యూటీ ఎంపీడీవో)తోపాటు పంచాయతీ కార్యదర్శులు ఉంటారు. గ్రేడ్ 1లో 4 వేల నుంచి 10 వేల జనాభాలోపు, లేకుంటే రూ.50 లక్షల నుంచి రూ.కోటి ఆదాయం ఉండాలి. మండల కేంద్రంలోని పంచాయతీని గ్రేడ్1గా పరిగణిస్తారు. గ్రేడ్ 2లో 2 వేల నుంచి 4వేలలోపు జనాభా ఉండాలి. గ్రేడ్ 3లోకి 2 వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలు వస్తాయి. ప్రస్తుతం జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో స్పెషల్ గ్రేడ్‌గా 18 పంచాయతీలు, గ్రేడ్1లో 128, గ్రేడ్2లో 131, గ్రేడ్ 3లో 108 పంచాయతీలు ఉన్నాయి. కాగా జనాభా, ఆదాయం ఆధారంగా గ్రేడ్‌లను ఎంపికచేసి ప్రభుత్వానికి నివేదించినట్టు జిల్లా పంచాయతీ అధికారిణి శాంతలక్ష్మి తెలిపారు.



రేషన్‌డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న నిషాంతి

జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారానే నిత్యావసర సరుకుల పంపిణీ : జేసీ

అమలాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారానే నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు రేషన్ డీలర్లు సన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. జిల్లాలో అత్యంత పారదర్శకంగా రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పునఃప్రారంభించి కార్డుదారులకు అందించడం జరుగుతుందన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎల్పీజీ, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ జూన్ 1న పండుగ వాతావరణంలో రేషన్ షాపులను పునఃప్రారంభించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ జిల్లాలో అందరి సమన్వయంతో ఆదర్శంగా పనిచేస్తుందన్నారు. రేషన్ పంపిణీని డీలర్లు సేవా కార్యక్రమంగా ఎంచి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఎల్పీజీ డీలర్లు డెలివరీ సిబ్బంది ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు నిర్వహించి రశీదులు జారీచేస్తూ చార్జీలు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారుల నుంచి అదనపు చార్జీలు, అంతస్తుల పేరిట వసూలుచేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీజీఎస్, ఐవీఆర్ఎస్ వ్యవస్థల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో అధిక ధరలు వసూలుచేస్తూ అవినీతికి పాల్పడినట్టు ఫిర్యాదులొస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాల ద్వారా కొత్త రేషన్‌కార్డుల జారీ, మార్పులు, చేర్పులకు సంబంధించి విధివిధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్పీజీ సిలిండర్ ధరలు ముందుగానే లబ్ధిదారుల ఖాతాకు ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్వో ఎ.ఉదయ భాస్కర్ మాట్లాడుతూ రేషన్‌దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేసేందుకు ఈనెలాఖరు నాటికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు సరుకుల పంపిణీ ప్రారంభిస్తారని, డీలర్లు సరైన తూనికలు, కొలతలతో ఖచ్చితత్వంతో సరుకులు అందజేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎం.బాలసరస్వతి, ఎల్పీజీ డీలర్ల ప్రతినిధి త్రినాథ్, రేషన్ డీలర్ల ప్రతినిధి అడపా వెంకటరమణ పాల్గొన్నారు.

వాంటెడ్ క్లాప్ మిత్ర..

- పంచాయతీలకు దొరకని క్లాప్ మిత్రలు
- కొన్ని పంచాయతీల్లో రెండు రోజులకు ఒకసారి చెత్త తొలగింపు
- చెత్త సంపద కేంద్రాలున్నా గ్రీన్ అంబాసిడర్లు ఏరీ..
- క్లాప్ మిత్రలకు జీతాలివ్వలేని స్థితిలో మైనర్ పంచాయతీలు
- అధికారుల ఉపన్యాసాలకే పరిమితమైన స్వచ్ఛ గ్రామాలు

ఉప్పలగుప్తం, మే23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తకు లోటులేదు. దాన్ని తొలగించే క్లాప్‌మిత్రలు దొరకడం లేదని పంచాయతీ ఉద్యోగులు అంటున్నారు. సమయానికి జీతాలు ఇవ్వకపోవడం, ఇతర వృత్తుల్లో ఎక్కువ లబ్ధి చేకూరడం వంటి కారణాలతో వంశపారంపర్యంగా ఉన్న క్లాప్‌మిత్రలు పంచాయతీలకు ముఖం చాటేశారు. దీంతో పలు పంచాయతీలు చెత్త సమస్యల్లో చిక్కుకున్నాయి. 'గ్రామాల్లో ఎక్కడా చెత్త కన్పించకూడదు. రహదారుల ప్రక్కన చెత్తకుప్పలుంటే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం. చెత్తను పొడి, తడిగా వేరుచేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలి.' అంటూ ఉన్నతాధికారులు హుకుం జారీచేశారు. చెత్త సంపద కేంద్రాల వద్ద సమావేశాలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు అసలు నిజాలను దాచిపెట్టి అధికారుల ఉత్తర్వులను అమలుచేస్తామని ప్రగల్భాలు పలికారు. స్వచ్ఛ గ్రామాలపై వారం రోజులు హడావుడి చేశారు. కట్ చేస్తే రోడ్ల పక్కన చెత్త అలానే ఉంది. చెత్త సంపద కేంద్రాలకు చెత్త చేరడం లేదు. అయినా ఇలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించిన అధికారులు కరువయ్యారు. ఒక సమస్య పరిష్కారం అవ్వాలంటే మూలం వెదకాలి. మూలాన్వేషణ జరక్కుండా తాత్కాలిక ఊరట కోసం ప్రయత్నిస్తే ఫలితం ఉండదు. ఇక్కడ చెత్త సమస్య పరిష్కారం అవ్వాలంటే మూలం క్లాప్‌మిత్ర. పంచాయతీల్లో ఏరోజుకారోజు చెత్తను ఊడ్చి రిక్షాలపై చెత్త సంపద తయారీ కేంద్రాలకు చేర్చాలి. అసలు సమస్య ఇక్కడే ఉంది. జిల్లాలో కొన్ని పంచాయతీల్లో క్లాప్‌మిత్రలు కరువయ్యారు. గతంలో ఉన్నవారు సమయానికి జీతాలు లేకపోవడంతో వృత్తిని వదులుకున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రతి వెయ్యి జనాభాకు లేదా 250 కుటుంబాలకు ఒక క్లాప్‌మిత్ర ఉండాలి. మేజర్ పంచాయతీల్లో క్లాప్‌మిత్రలు సేకరించిన చెత్తను గ్రీన్ అంబాసిడర్లు ట్రాక్టర్లు లేదా స్వచ్ఛ వాహనాల ద్వారా చెత్తసంపద కేంద్రాలకు తరలిస్తారు. క్లాప్‌మిత్రకు రూ.5వేల నుంచి 10వేల వరకు జీతం చెల్లించాల్సివుంటుంది. గతంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రీన్ అంబాసిడర్లకు వేతనం చెల్లిస్తామన్న ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కాలేదు. దీంతో పలు పంచాయతీల్లో వాహనాలు మూలనపడ్డాయి. ఇక క్లాప్‌మిత్రల అంశం తీసుకుంటే ఆర్థిక భారం మోయలేక పలు పంచాయతీలు స్థానిక శ్రామికులతో రోజువారీ వేతనాలకు చెత్తను ఊడ్పిస్తున్నాయి. నిపుణులైన క్లాప్ మిత్రలు కావాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతన చెల్లింపు జరగాలి. అన్ని పంచాయతీలకు ఆ సామర్థ్యం ఉండదని అధికారులకు తెలుసు. ఈ వేతనాలు పంచాయతీ జనరల్ ఫండ్ లేదా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించవచ్చన్న ఆదేశాలున్నాయి. ప్రస్తుతం చెత్త నుంచి సంపద తయారీపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నారు. అసలు సమస్యను విస్మరించి ఈ శిక్షణా కార్యక్రమాలేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రెండు లేదా మూడు రోజులకు ఒకసారి చెత్తను ఊడ్పిస్తున్నారని ఈనెల 17న భీమనపల్లిలో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జనం అధికారులను నిలదీశారు.



గొల్లవిల్లి మెయిన్ రోడ్‌లో చెత్త సేకరిస్తున్న క్లాప్‌మిత్ర



సన్నవిల్లి- ఉప్పూడి రోడ్డులో చెత్త



అమలాపురంలో కొత్తగా నిర్మించిన క్రైమ్ పోలీసుస్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ కృష్ణారావు

నేరాల నియంత్రణకు సమష్టిగా కృషిచేయాలి

క్రైమ్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభించిన ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, మే23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల నియంత్రణకు అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవడం ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చన్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో నూతనంగా నిర్మించిన క్రైమ్ పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. సంప్రదాయబద్ధంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ నూతనంగా జిల్లా ఏర్పడినప్పటి నుంచి క్రైమ్ విభాగానికి ప్రత్యేక పోలీసుస్టేషన్ లేకుండానే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుత సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.గజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఈ పోలీసుస్టేషన్‌ను నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, స్పెషల్ బ్రాంచి, సీసీఎస్ పోలీసులు, పట్టణ సీఐ పి.వీరబాబు పాల్గొన్నారు.


వాడపల్లిలో స్టాల్ పెట్టి వడియాల విక్రయం

నోరూరించేలా..

ఏ ఇంట చూసినా వడియాల తయారీలో మహిళలు బిజీ
కమ్మని రుచులను రుచి చూపిస్తున్న గోదారోళ్లు

ఆత్రేయపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రకృతి అందాల సోయగాలకే పరిమితం కాదుసుమీ. కమ్మని పచ్చళ్ల, నోరూరించే పిండి వంటలకు పెట్టింది పేరు. అతిథులు ఇంటికి వస్తే గోదారోళ్ల అప్యాయత, అనురాగాలతో పాటు కమ్మని రుచులను రుచి చూపిస్తారు. ప్రస్తుత వేసవిలో పచ్చళ్లు పెట్టడంలో గోదారోళ్లు బీజీబీజీగా ఉన్నారు. మండే ఎండల్లో గుమ్మడి వడియాలు, పిండి వడియాలు, మజ్జిగ మిరపకాయలు, పెసర వడియాలు తయారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏడాది పాటు తినేందుకు ఈ వడియాలను తయారు చేసుకుంటారు. బంధుమిత్రుల ఇళ్లకు పచ్చళ్లతో పాటు వడియాలపై పంపిస్తుంటారు. పప్పుచారు-వడియాలు కాంబినేషన్ ఎంతో రుచికరంగా ఉంటుంది. నాన్‌వెజ్ ప్రియులు ఎంతో ఇష్టంగా రకరకాల వడియాలను అమితంగా భుజిస్తారు. వివిధ రకాల వడియాలను మహిళలు వ్యాపారంగా మలుచుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. వాడపల్లి, లొల్ల గ్రామాల్లో స్టాల్స్ పెట్టారు. గుమ్మడి వడియాలు, మజ్జిగ మిరపకాయలు కిలో రూ.400, పిండి వడియాలు, చిప్స్ కిలో రూ.300 చొప్పున అమ్మకాలు సాగిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన వారు వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. వారు రుచి చూసి మరలా వచ్చేటప్పుడు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంత మహిళల వడియాల తయారీ వ్యాపారం విరాజిల్లుతోంది.


గుమ్మడి వడియాలు


మజ్జిగ మిరపకాయలు


పిండి వడియాలు



రెడ్ అలెర్ట్

ఈ చిత్రాల్లో ఇళ్ల ముందు కన్పిస్తున్న ఎర్ర రంగు నీళ్ల సీసాలను చూస్తున్నారు కదూ.... వీటి వెనుక చిన్న కథ వుంది.. కాకినాడ జగన్నాథపురం వాసులను వీధి కుక్కలు భయపెడుతున్నాయి. వాటి బారి నుంచి తప్పించుకోవడానికి ఎం చేయాలా అని ఆలోచించారు. యూట్యూబ్‌లో వైరల్ అవుతున్న ఓ వీడియో వారి కంటపడింది. పూణేలోని ఓ ప్రాంతంలో ఇదే తరహాలో వీధి కుక్కలు విజృంభించడం మొదలెట్టాయి. దీంతో వారంతా ఎర్ర రంగు నీళ్లు కలిపి సీసాల్లో పోసి వారి నివాసాల ముందు పెట్టారు. దీంతో కుక్కల బెడద 90 శాతం తగ్గింది. దీంతో జగన్నాథపురం ప్రజలూ అదే టెక్నిక్‌ను ఫాలో అయ్యారు. ఇంకేముంది ఇక్కడా కుక్కలు ఇళ్ల ముందుకు వచ్చి అరిస్తే ఒట్టు.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ





సహజసిద్ధ సిలైన్ కొబ్బరిబొండం

కొబ్బరిబొండంలో షోషకాలు మెండు
మండు వేసవిలో చల్లదనాన్నిచ్చే కొబ్బరి బొండాలు



అంబాజీపేట, మే 18(ఆంధ్రజ్యోతి): అది చెరకురసంలా తియ్యగా ఉండదు... పోని మామిడి పండు రసంలా నోరూరించదు.. శీతల పానీయంలా చల్లగానూ ఉండదు. అయినా బోలెడంత ఆరోగ్యానిస్తుంది. వేసవి తాపాన్ని పూర్తిగా తీరుస్తుంది. ఏడాది పొడవునా కొబ్బరి బొండాలు దించినా వేసవిలో మాత్రం వీటికి ఎక్కడలేని డిమాండ్ ఉంటుంది. చాలా మందికి రోజుకు ఒక బొండం తాగినిదే దాహం తీరదు. కాస్త తియ్యగా, ఒకింత ఉప్పగా, కొంచెం వగరుగా ఉండే లేత కొబ్బరి నీరు అద్భుతమైన పానీయం. దప్పికను, అలసటను చిటికెలో మాయం చేసే ఉత్తేజాన్నందించే పోషకసేవనం. ఏకైక రక్షిత సహజ శీతల పానీయం. ఈ కొబ్బరి బొండం తాగమని ఏ ప్రముఖ సినీనటులు, క్రీడాకారులు కోట్లు తీసుకుని కూల్ డ్రింక్స్ మాదిరిగా ప్రచారం చేయరు. చేయనవసరమూ లేదు. వైద్యులు, సూచనలతోపాటు విద్యావంతులు, సామాన్యులు కొబ్బరి బొండం విశిష్టతపై అవగాహన పెంచుకోవడంతో రోజురోజుకు వీటి వినియోగం విపరీతంగా పెరుగుతుంది.

కొబ్బరి బొండాలలో రకాలు

ప్రకృతి సిద్ధంగా పెరిగే కొబ్బరి బొండాలలో సుమారు మూడు రకాలున్నాయి. మొదటి రకాన్ని గంగా బొండాలని అంటారు. ఈ బొండాలలో కొబ్బరి ముక్క చాలా మందం తక్కువగా ఉండి, అధిక నీళ్లతో చాలా తియ్యగా ఉంటుంది. ఈ బొండంలో సుమారు 250 మిలీ నుండి 300 మి.లీల వరకు నీళ్ళు కలిగి ఉంటాయి. అయితే ఈ గంగా బొండాలు చాలా అరుదుగా దొరుకుతాయి. రెండవ రకానికి చెందిన బొండాలు ఈస్ట్‌కోస్ట్‌టాల్. ఈ బొండాలు ఎక్కువగా దొరుకుతాయి. ఇవి రెండు, మూడు రంగులలో కనిపిస్తుంటాయి. వీటిలో నీళ్ళు తక్కువగా ఉండి కొబ్బరి ముక్క మందంగా ఉండి ఎండు కొబ్బరికాయలుగా వినియోగించుకోవడానికి బాగా ఉపయోగపడుతుంది. ఈ బొండాలనే వివిధ ప్రాంతాలకు అధికంగా రవాణా చేస్తుంటారు. మూడవ రకానికి చెందిన బొండాలు మలేషియా ఎల్లోడార్ఫ్(హైబ్రీడ్ బొండాలు) ఈ బొండాలు పసుపుపచ్చ రంగులో ఉండి దీనిలో కొబ్బరి ముక్క మందం చాలా తక్కువగా నీళ్ళు అధికంగా ఉంటాయి. ఇవీ కోనసీమ పరిసర ప్రాంతాలలో ఈ చెట్లు అరుదుగా ఉంటాయి. దీనికి సంబంధించిన విత్తనం మల్లేషియాకు చెందినది కావడంతో ఈ కొబ్బరి చెట్లు మలేషియా ఎల్లోఆర్ఫ్ అని పిలుస్తారు. మరికొందరు హైబ్రిడ్ కొబ్బరి బొండాలని అంటారు.

కొబ్బరి బొండం ఓ సహజ సిలైన్

మనిషికి సిలైన్‌బాటిల్‌లా నేరుగా శక్తినిచ్చే గుణం కొబ్బరి బొండంలోనే ఉంది. అందుకనే దీన్ని సహజసిలైన్ అంటారు. ఇది ఎమర్జన్సీ గ్లూకోజ్‌గా ఉపయోగపడుతుంది. దీని లో విటమిన్లు, ఖనిజలవణాలు, ఆరోగ్య దాతు లక్షణాలు కలిగి ఉంటాయి. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ బొండం నీళ్ళు ఎంతో ఉపశమనాన్నిస్తాయి. ఎందుకంటే ఇవి సహజంగానే సెర్టిలైజ్డ్ మినరల్ వాటర్. ఎలాంటి మలినాలు, సూక్ష్మ జీవులు ఉండవు. బొండం నీళ్ళు తాగితే మనిషి ఒక పూట భోజనం చేస్తే కలిగే బలాన్నిస్తుంది. వేసవికాలంలో ఈ బొండాలకు మంచి గిరాకి ఉంటుంది. అప్పుడు, ఇప్పుడు అనే కాలపరిమితి ఏమి లేకుండా నిత్యం కొబ్బరి బొండాలు లభిస్తాయి. వేసవి తాపాన్ని తట్టుకోలేక సహజ సిద్ధంగా తయారు చేసిన శీతల పానీయం కంటే కొబ్బరి బొండాలు తాగడానికిఏ అందరే ఇష్టపడతారు. నిగనిలాడుతూ పచ్చగా కనిపిస్తూ అందరిని ఆకట్టుకుంటే వాటిలో దాగి ఉన్న నీళ్ళు వేసవితాపం నుంచి సేదతీరుస్తాయి. కొన్ని దేశాల్లో లేతకొబ్బరినీళ్ళను టిన్‌ల్లో ప్యాకింగ్ చేసి విక్రయిస్తుంటారు అమెరికాన్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ అసోసియన్ కొబ్బరి నీళ్ళు మూడు వారాలపాటు నిల్వ ఉండేలా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఓ ప్రత్యేక క్యాన్‌ను తయారు చేసింది. అటువంటివి మనకు అందుబాటులోకి వస్తే కూల్‌డ్రింక్‌లు కనమరుగవ్వడం తప్పదు.



కొబ్బరి బొండంలో ఉండే పోషకాలు

లేత కొబ్బరి బొండంలో 90 శాతం నీరే. ఒంటిని చల్లబర్చే గుణాలు ఇందులోనే ఎక్కువ. ఇది జీర్ణ వ్యవస్థనను బాగు చేస్తుంది. కాస్త లేత కొబ్బరి కట్టినదే మధ్య వయస్కు బొండం. ఇందులోని నీళ్లలో పోషక శాతం ఎక్కువ. పిండి పదార్థాలు, ఖనిజాలు, ఫాస్పరస్, విటమిన్ ఎ,డి,సిలు మిగిలిన రెండింటిలో కన్నా ఎక్కువ. కొబ్బరి బాగా కట్టినదే పక్వదశ. జీర్ణశక్తి పెద్దగా లేని వారు ఈ దశలోనే కొబ్బరిని ఎక్కువగా తినడం మంచిదికాదు. అందుకే మూడింటిలోకి లేత, మధ్య వయసు బొండాలు శరీరంలోని వివిధ రకాల కణజాలాల పెరుగుద పనితీరుకు తోడ్పడతాయి. 100గ్రా లేత కొబ్బరి నీళ్లలో పోషక విలువలు. శక్తి 17.4 శాతం, నీరు 95.5 శాతం, కార్బొహైడ్రేట్స్ 4.4 శాతం, ప్రొటీన్‌లు 0.01 శాతం, క్రొవ్వు 0.01 శాతం, నైట్రోజన్ 0.05 శాతం, ఫాస్పొరిక్‌యాసిడ్ 0.56 శాతం, పోటాషియం 290 మి.గ్రా, కాల్షియం 44 మి.గ్రా, సోడియం 44 మి.గ్రా, మేగ్నీషియం 10 మి.గ్రా, ఫాస్పరస్ 9.2 మి.గ్రా, ఐరన్ 106 మి.గ్రా, కాపర్ 26 మి.గ్రాలు బొండంలోని పోషక విలువలు.

ప్రశాంతంగా ఈఏపీసెట్ ఇంజనీరింగ్ పరీక్ష

రెండు సెషన్లలో 9 కేంద్రాల్లో నిర్వహణ.. 4,447 మంది విద్యార్థుల హాజరు

జేఎన్టీయూకే, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఇంజనీరింగ్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష శుక్రవారం కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగిందని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించామన్నారు. మూడు జిల్లాల్లోని 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో మొత్తం 4,592 మంది విద్యార్థులకు 4,447 మంది హాజరు కాగా 145 మంది గైర్హాజరయ్యారన్నారు. కాకినాడ జిల్లాలో 96.93 శాతం, తూర్పు గోదావరి జిల్లాలో 97.34 శాతం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 95.42 శాతం హాజరు నమోదైందని కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు శనివారం కూడా కొనసాగుతాయన్నారు.


కూనవరం, చింతూరు మీదుగా
భద్రాచలం సర్వీసుల మళ్లింపు

మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌తో ఆర్టీసీ ముందుజాగ్రత్త

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్, మరికొందరు మావోయిస్టు ముఖ్యనేతల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారుల నుంచి అందిన సమాచారంతో జిల్లా ఆర్టీసీ ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. పోలీసు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో భద్రాచలం రూటులో ఆర్టీసీ అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా గోకవరం మీదుగా భద్రాచలం నడిచే అన్ని బస్సు సర్వీసుల రూట్లలో మార్పులు చేశారు. ఏడుగురాళ్లపల్లి మీదుగా సర్వీసులను తిప్పకుండా కూనవరం, చింతూరు రూటులో మళ్లించారు. గోకవరం డిపో నుంచి వయా ఏడుగురాళ్లపల్లి మీదుగా భద్రాచలం ఎక్కువ సర్వీసులు నడిచేవి. రాజమహేంద్రవరం డిపో నుంచి ఒక సర్వీసు మాత్రమే గోకవరం రూటులో వెళుతోంది. ఈ సర్వీసు రూటును కూడా వయా కూనవరం, చింతూరుకు మార్పు చేశారు. అలాగే, సీలేరు వెళ్లే సర్వీసులను వీలైనంత త్వరగా వెనక్కి తీసుకురావడం చేయాలని, ఒక వేళ నైటవుట్స్ ఉంటే ప్రయాణికులను దింపేసిన తర్వాత ఆ బస్సులను సమీప పోలీస్టేషన్‌కు తరలించాలని ఆర్టీసీ అధికారులకు పోలీసుల నుంచి ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం. తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ ఈ జాగ్రత్తలు పాటించాలని పోలీసుల నుంచి ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు వచ్చినట్టు చెబుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం.. మొలకలెత్తిన ధాన్యం

కొనుగోలు చేయాలని రైతు అభ్యర్థన


మొలకెత్తిన ధాన్యం రాశి

తాళ్లరేవు, మే 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలోని పి.మల్లవరం కృషి అమృత్ గో ఆధారిత వ్యవసాయ క్షేత్రంలో పండించిన ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం కల్లంలో ఉండిపోయి ఇటీవల కురుస్తున్న వర్షాలకు మొలకలెత్తింది. రైతు ధూళిపూడి వెంకటరమణ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు.

వెంకన్న ఆలయాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- దేవదాయశాఖ కమిషనరు రామచంద్రమోహన్
- త్వరలోనే డార్మెటరీ, వసతి గదుల నిర్మాణానికి చర్యలు
- ఎమ్మెల్యే బండారు


కమిషనరుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఉపకమిషనరు

ఆత్రేయపురం, మే 23(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మాస్టర్ ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ఆలయ అభివృద్ధి ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. పార్కింగ్ ప్రదేశాలు, శ్రీనివాస ఆలయ ప్రాంగణం, ఆలయ తిరువీధులు, అన్నదాన భవనం, క్షేత్రంలో పర్యటించి భక్తులకు అందిస్తున్న సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. కొద్దినెలల నుంచి వాడపల్లి క్షేత్రం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతోందని, ప్రతి శనివారం 50వేల నుంచి 60వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారన్నారు. దూరదృష్టితో అభివృద్ధి ప్రణాళిక ఏర్పాటు చేసి మాస్టర్ ప్రణాళికను ఆమోదిస్తామన్నారు. అందుకే ఈ క్షేత్రాన్ని స్వయంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకున్నట్టు కమిషనర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. అత్యవసర పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు.దేవస్థానం నిధులతో డార్మెటరీ నిర్మాణం, తాత్కాలిక అన్నదాన షెడ్, 50 వసతుల గదుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టిసారించామని త్వరలోనే మంజూరు ఉత్తర్వులు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, సీఎం చంద్రబాబు వేగంగా అభివృద్ధి చెందుతున్న క్షేత్రంపై తమ వద్ద చర్చించారన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. రానున్న కాలంలో క్యూ కాంప్లెక్స్ నిర్మాణం కంపార్ట్‌మెంట్లు, స్లాట్ సిస్టమ్ అమలు చేయాల్సి ఉందన్నారు. స్థల సమస్య నేపథ్యంలో కొన్ని గృహాలు ఖాళీ చేయాల్సి ఉందని, వారితో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. అనంతరం దేవదాయ శాఖ ఈఈ దుర్గేష్, డీఈ జె.శ్రీనివాస్, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతో అభివృద్ధి పనులపై చర్చించారు. తహశీల్దారు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బీ-ఆర్క్, బి-ప్లాన్ ఫలితాల్లో
తిరుమల ప్రభంజనం


రామ్‌సాయి వరుణ్‌రెడ్డి, యశ్వంత్ సాత్విక్

రాజమహేంద్రవరం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ (మెయిన్స్) బీ-ఆర్క్, బీ-ప్లాన్ ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యా సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. బీ-ఆర్క్ జనరల్, ఈడబ్ల్యూఎస్ విభాగంలో కె.యశ్వంత్ సాత్విక్ ఆలిండియా 1వ ర్యాంకు, వి.రామ సాయి వరుణ్ రెడ్డి 4వ ర్యాంకు సాధించారన్నారు. బీ-ప్లాన్ విభాగంలో వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో కె.యశ్వంత్ సాత్విక్ 3వ ర్యాంకు, వి.రామసాయి వరుణ్ రెడ్డి 3వ ర్యాంకు, టి.షణ్ముఖ శ్రీనివాస్ 24వ ర్యాంకు, టి.జశ్వంత్ దొర 63వ ర్యాంకు, వై.సాయితేజ, టి.పవన్ శ్రీకుమార్‌చౌదరి 78వ ర్యాంకు, సుంకర జోషిచంద్ 99వ ర్యాంకు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తో కలిసి అభినందించారు.

చైన్ స్నాచర్ అరెస్టు

రూ.13 లక్షల విలువైన 130గ్రాముల బంగారం స్వాధీనం

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): 12 చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితుడిగా ఉన్న తాడిమళ్ల గ్రామానికి చెందిన దేశాల ప్రవీణ్‌ని శుక్రవారం అరెస్టు చేశామని త్రీటౌన్ సీఐ వి.అ ప్పారావు తెలిపారు. కోడిపందేలు, జల్సాలకు అలవాటుపడి అతడు దొంగతనాలు చేస్తున్నాడన్నారు. చోరీ సొత్తును కొంత కాలం తన వద్దే ఉంచుకొని.. కొద్దిరోజుల తర్వాత విక్రయిస్తుంటాడన్నారు. ఈ క్రమంలో రాజమండ్రి వస్తుండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. సుమారు రూ.13 లక్షలు విలువ చేసే 130గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన డీఎస్పీ కె.రమేశ్‌బాబు, సీఐ అప్పారావు, ఎస్ఐ వి.అప్పలరాజు, సీసీఎస్ సీఐ శ్రీధర్ కుమార్, ఎస్ఐలు ఆనందరెడ్డి, టీఎన్‌కే స్వామి, హెచ్‌సీలు ప్రసాద్, వెంకట రమణ, పీసీ సురేశ్‌లను ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

శత్రువైనా! వృత్తి ధర్మం పాటించాలి

- ఆకట్టుకున్న కొత్త పరిమళం నాటిక
- రామవరంలో జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు


కొత్త పరిమళం నాటికలో ఓ సన్నివేశం

అనపర్తి, మే 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలోని నల్లమిల్లి మూలారెడ్డి కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 36వ జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు మూడో రోజైన శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన విడాకులు కావాలి, కొత్త పరిమళం, నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలు ఆకట్టుకున్నాయి.

దాంపత్య జీవితంలో ఒడిదుడుకులు, చిన్న చిన్న మనస్పర్థలు రావడం సహజమని, దంపతులు వాటిని ఎదుర్కొనాలే గాని విడాకుల కోసం పరుగులు తీయడం సరైన పద్ధతి కాదని సాటి చెప్పే కథాంశంతో సాగిన విడాకులు కావాలి నాటిక ఆకట్టుకుంది. భార్యాభర్తలు మనసు విప్పి మాట్లాడుకోవడం ద్వారా అనేక సమస్యలు సమసి పోతాయంటూ తాడేపల్లికి చెందిన అరవింద్ ఆర్ట్స్ ప్రదర్శించిన నాటిక ప్రేక్షకులను అలరించింది.

భారత దేశ సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న మిలటరీ వైద్యుడు, సరిహద్దు పొరుగు దేశంలో కాన్పు కష్టమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణిని కాపాడేందుకు వెళ్లి ప్రసవం తరువాత భారత సరిహద్దులోకి ప్రవేశించే సమయంలో పాకిస్తాన్ మిలటరీకి చిక్కుతాడు. వైద్యుడిని బందీగా తీసుకెళ్లాలన్న పాక్ మిలటరీ అధికారి. వైద్య ధర్మం కోసం తన ప్రాణాలకు తెగించి పొరుగు దేశం బోర్డరుకు వచ్చి వైద్యం అందించిన వైద్యుడి మనసును అర్థం చేసుకుని క్షేమంగా బోర్డరు దాటిస్తారు. వృత్తి ధర్మాన్ని కళ్ల కట్టినట్టు బోరివంకకు చెందిన శర్వాణి గిరిజన సాంస్కృతిక సేవా కేంద్రం కొత్త పరిమళం నాటికను ప్రదర్శించింది.

రచయితలుగా ఉన్న ఇద్దరు మిత్రులు తమ పిల్లలకు వివాహం జరిపిస్తారు. అయితే భార్యాభర్తల మనస్సులు కలవకపోవడంతో విడిపోయే పరిస్థితికి చేరుకుంటారు. భార్య మరొకరికి దగ్గరవుతుంది. వివాహేతర బంధం మోజులో కూతురిని చంపేస్తుంది. ఆమెపై భర్త ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో భర్తే ఆమెను నరికి, ఆమె తలతో పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోతాడు. వివాహేతర బంధం మానవ సంబంధాలను చిన్నాభిన్నం చేస్తుందన్న కథాంశంతో విశాఖపట్నానికి చెందిన తెలుగు కళా సమితి ప్రదర్శించిన నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది.

కొవ్వూరులో వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉరి పోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కొత్తపాలేనికి చెందిన ఓలేటి ధర్మారావు(50), భార్య, ముగ్గురు కొడుకులతో నెలరోజుల క్రితం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలోని దండమూడి సాయి ఇంటి వద్ద పని నిమిత్తం వచ్చి ఇక్కడే మకాం ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2:30గంటల సమయంలో మకాం ఉండే పాకలో రుమాలుతో ధర్మారావు ఉరిపోసుకుని ఆత్మత్య చేసుకున్నాడు. పెద్ద కోడలు కుమారి చూసి వెంటనే కిందకు దింపి అక్కడే ఉన్న సతీష్ సహాయంతో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. ఆసుపత్రి సమాచారం, మృతుడి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

రేపు స్విమ్మింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కాకినాడ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ కార్య దర్శి ఇరుసుమళ్ల రాజు

సామర్లకోట, మే 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1న పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరుగనున్న అంతర్ జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు గాను క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 25న సామర్లకోట దుర్గాప్రసాద్ పాఠశాలలో జరుగనున్నట్టు కాకినాడ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఇరుసుమళ్ల రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. 15 ఏళ్ల వయస్సు నిండిన బాలబాలికలు అంతర్ జిల్లాల ఈత పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. వీరికి ఈ నెల 25న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ పాఠశాలలోని ఈతకొలనులో ఎంపిక కార్యక్రమాన్ని నిర్వ హించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు ఈ ఎంపికలో పాల్గొనవచ్చని రాజు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ సీజీఎం ప్రత్యేక పూజలు


వేదాశీర్వచనం పొందుతున్న సీజీఎం దంపతులు

సామర్లకోట, మే 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బీఎస్ఎన్ఎల్ సౌత్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజరు పి.మురళీమోహన్ సతీసమేతంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న సీజీఎం మురళీమోహన్ దంపతులకు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అన్ని ఉపాలయాలను దర్శించిన సీజీఎం దంపతులు భీమేశ్వరస్వామికి అభిషేక పూజలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన నిర్వహించారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు, స్వామివారి, అమ్మవారి చిత్రపటాలను ఈవో నీలకంఠం చేతులమీదుగా అందజేసారు. ఈ సందర్భంగా పలువురు బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

- వైరస్ హెచ్చరికలతో అప్రమత్తం
- కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు



కాకినాడ జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొవిడ్ వార్డు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్

జీజీహెచ్(కాకినాడ) మే 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కొన్ని రోజులుగా కొవిడ్ కేసులు అనూహ్యంగా పెరుగుతుండంతో పాటు మన రాష్ట్రంలోని విశాఖపట్నంలో తాజాగా ఒక పాజిటివ్ కేసు నమోదు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం కొవిడ్ నియమాలను అమలులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో బోధనాసుపత్రి అయిన కాకినాడ జీజీహెచ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కొవిడ్ వార్డు ఏర్పాటు చేశారు. ఈఎన్‌టీ విభాగంలో ఏర్పాటు చేసిన కొవిడ్ ఐసోలేషన్ వార్డును డాక్టర్ విఠల్ సందర్శించి ఏర్పాట్లపై వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. వెంటిలేటర్లు, ప్రత్యేక పడకలు, ఆక్సిజన్ సరఫరా, పీపీఈ కిట్లు, మాస్కులు, గ్లౌజుల లభ్యతను పరిశీలించారు. విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అనుసరిస్తూ ప్రత్యేక కొవిడ్ వార్డు ఏర్పాటు చేశామన్నారు. రోగులను అప్రమత్తం చేయడానికి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు 10 కొవిడ్ టెస్టులు చేస్తుండగా, హైరిస్క్ గ్రూపులకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ప్రభుత్వం సూచనల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యలుగా కొవిడ్ టెస్టింగ్ శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సామాజిక బాధ్యతతో ముందుగానే కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ 5వేల ఎన్95 మాస్కులను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కరోనా వైరస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జీజీహెచ్ యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉందన్నారు. పల్మనాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసన్, అనస్థీషియా వైద్య నిపుణులను బృందాలుగా చేసి నియమించామని వారు 24 గంటలూ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో మాస్క్ తప్పనిసరిగా ధరించడం, శానిటైజేషన్ చేయడం, తరచూ చేతులు కడుక్కోవడం, శానిటైజర్లు ఉపయోగించడం తప్పనిరని డాక్టర్ విఠల్ తెలిపారు. భౌతిక దూరం కనీసం ఆరు అడుగులు ఉండేలా పాటించడం అవసరం. గోరువెచ్చని నీటిని పుక్కిలించడం, వేడి ఆహారాన్ని భుజించడం, వేడి పానీయాలు సేవించడం తప్పనిసరి. అనుమానిత వ్యక్తులు తక్షణం టెస్టులు చేయించుకోవాలన్నారు. జ్వరం, దగ్గు, శ్వాసకోస ఇబ్బందులు ఉన్నవారు వెంటనే అర్హత కలిగిన వైద్యుడిని సంప్రదించాలన్నారు. అర్హులైన వారికి వ్యాక్సిన్ బూస్టర్ డోసులు వేయించాలని ప్రభుత్వం సూచించింది. సాధ్యమైనంత వరకు భారీ ప్రదర్శనలు, సమావేశాలను నివారించాలి. అత్యవసరమైతేనే తప్ప బయటకు వెళ్లకపోవడం శ్రేయస్కరం. వీటిని పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని విఠల్ పేర్కొన్నారు.

గిరిజన సలహా మండలిలో రంప ఎమ్మెల్యే

రంపచోడవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చైర్‌పర్సన్‌గా 16మంది సభ్యులతో గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మండలిలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికు చోటు దక్కింది. ఆమెతో పాటు పోలవరం ఎమ్మెల్యే చిర్రా బాలరాజు, పాడేరు ఎమ్మెల్యే ఎమ్.విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే రేగా మత్స్యలింగం వంటి వారు గిరిజన సంక్షేమ కార్యదర్శి, గిరిజన సంక్షేమ డైరెక్టర్ సభ్యులుగా ఈ మండలిలో కొనసాగుతారు. గిరిజన ప్రాంతాలకు అవసరమైన చట్టాలు, విధానాల రూపకల్పనతో పాటు ఎటువంటి సవరణలు చేయాలన్నా ఈ గిరిజన సలహా మండలి ఆమోదం తప్పనిసరిగా కావాలి.

మోటార్‌సైకిల్ అదుపుతప్పి.. అంతులేని విషాదాన్ని నింపి..

- హైవే స్తంభాలను ఢీకొని తల్లి మృతి
- తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు
- కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి వద్ద ఘటన

తొండంగి, మే 23 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది క్షణాల్లో ఇంటికి చేరుతారనగా ఓ ప్రమాదం కుటుంబంలో అంతులేని విషాదాన్ని నింపింది. మోటార్‌సైకిల్ అదుపుతప్పి తల్లి అక్కడికక్కడే మృతిచెందగా తండ్రి, కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తొండంగి మండలం గోపాలపట్నం గ్రామానికి చెందిన సాగి ఆనంద్ హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి మానసిక ఆరోగ్య పరిస్థితి బాగుండకపోవడంతో శుక్రవారం ఉదయం తల్లి అమ్మాజీ(45)తో కలిసి కాకినాడలో ఓ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అనంతరం కాకినాడ నుంచి మోటార్ సైకిల్‌పై తిరిగి గోపాలపట్నం వస్తుండగా బెండపూడి పోలవరం కాల్వ సమీపంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డును ఆనుకుని ఉన్న హైవే స్తంభాలను ఢీకొంది. దీంతో వెనుక కూర్చున్న అమ్మాజీ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సూరిబాబు, ఆనంద్‌కు తీవ్రగాయాలు కావడంతో వారిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అన్నవరం గ్రామం పొలిమేర వరకూ వెళ్లినవారు మరికొద్ది క్షణాల్లో ఇంటికి చేరుతారనగా జరిగిన ప్రమాదం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఫైల్‌ఫొటో మరణించిన అమ్మాజీ



ఆనంద్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

అన్నవరం దేవస్థానం ఏఈవోకు షోకాజు నోటీసులు

అన్నవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంచిర్యాల నుంచి విచ్చేసిన సేవకుల పట్ల దురుసుగా ప్రవర్తించిన కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఏఈవో కొండలరావుకు ఈవో సుబ్బారావు శుక్రవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. బధ్యతయుతమైన ఉద్యోగంలో ఉంటూ క్రిమినల్ కేసులు పెడతాం, తక్షణం కొండ దిగి వెళ్లిపోవాలని అనడం ఏమిటని ప్రశ్నించారు. తనపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో 5రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ అంశంపై దేవదాయ కమిషనర్ సైతం ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం తునికి చెందిన శ్రీవారి సేవకుల సంఘం తరుపున దుర్భాషలాడిన ఇద్దరి మహిళలను ఈవో కార్యాలయానికి పిలిపించారు. డిప్యూటీ కమిషనర్, సహాయ కమిషనర్‌లు వారిపై విచారణ చేపట్టి సమాచారం తీసుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. వారిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

హైడ్రా క్రేన్ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి

సర్పవరం జంక్షన్, మే 23 (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకుని నడచుకుంటూ ఇంటికి వెళ్తున్న పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌ని వెనుక నుంచి హైడ్రా క్రేన్ ఢీకొనడంతో మృతి చెందాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన మాతా అప్పలరాజు (57) స్థానిక పంచాయతీలో 2014 నుంచి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ట్రాక్టర్ నడిపి చెత్తా, వ్యర్థాలను డంపింగ్ యార్డులో వేసి ట్రాక్టర్‌ను పంచాయతీ కార్యాలయం వద్ద ఉంచి ఇంటికి నడచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనకాల నుంచి వస్తున్న హైడ్రా క్రేన్ అప్పలరాజును ఢీకొంది. తీవ్ర గాయాలతో రక్తస్రావంతో అపస్మారకస్థితిలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌ని స్థానికులు మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ వాహనంలో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే మార్గమధ్యంలో మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారిలో ఓ కుమార్తెకు వివాహం చేయాల్సి ఉంది. కుటుంబ యాజమాని మృతిచెందడంతో భార్య, కుమార్తెలు మృతదేహంపై పడి కన్నీరు మున్నీరుగా విలపించారు. అప్పలరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. జీజీహెచ్ ఔట్ పోస్ట్ పోలీసుల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సర్పవరంఎస్ఐ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు.



అప్పలరాజు మృతదేహం

పర్యాటకానికి వచ్చి గుండెపోటుతో మృతి

మారేడుమిల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతానికి వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. జంగారెడ్డిగూడెనికి చెందిన తమ్మిన జగదీశ్వరరావు (55) గురువారం మారేడుమిల్లి ప్రాంతానికి వచ్చి సాయంత్రం సమయంలో పాములేరువాగు సమీపంలో తన కారు పక్కగా అచేతన స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి మారేడుమిల్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ సీహెచ్.గోపాలకృష్ణ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. జగదీశ్వరరావు జంగారెడ్డిగూడెంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. దీనిపై మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియాసుపత్రికి తరలించారు.



మరణించిన జగదీశ్వరరావు

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం విజయవాడకు చెందిన సాయిబాబా, వెంకట సత్యవాణి దంపతులు రూ.2,00,116 విరాళంగా ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. ఆయన దాతలను అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

స్పైరల్ కేసింగ్ పనులు పూర్తి

పొల్లూరు జల విద్యుత్ కేంద్రం మేనేజర్



ఆరో యూనిట్ పనులను పర్యవేక్షిస్తున్న దృశ్యం

మోతుగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోని 6వ యూనిట్‌కు సంబంధించి స్పైరల్ కేసింగ్ పనులు పూర్తయ్యాయని ప్లాంట్ మేనేజర్ బి.బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో ఆరో యూనిట్ స్పైరల్ కేసింగ్ పనులు పూర్తి కావడంతో శుక్రవారం స్పైరల్ కేసింగ్ హైడ్రోలిక్ టెస్టింగ్ నిర్వహించగా విజయవంతంగా ముగిసిందని తెలిపారు. 5, 6 యూనిట్లకు సంబంధించిన స్పైరల్ కేసింగ్ పనులు పూర్తి కావడంతో యూనిట్లకు సంబంధించి టర్బైన్ స్టాటర్ జనరేటర్ విభాలకు సంబంధించిన పనులను ప్రారంభిస్తారని చెప్పారు. ఇటీవల జనరేటర్ స్టాటర్ విభాగాకు సంబంధించిన యంత్రాలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బీహెచ్ఈఎల్ భోపాల్ నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో ఈ 2 యూనిట్లు అందుబాటులోకి వస్తే పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో మరో 230 మెగావాట్ల సామర్థ్యం పెరగనుందని పేర్కొన్నారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో 5, 6 యూనిట్లు ఈ ఏడాది చివరి నాటికి వినియోగంలోకి వచ్చేలా పనులు శరవేగంగా చేయిస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

పిఠాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): టైల్స్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కార్మికుడు మరణించాడు. ఒడిశా రాష్ట్రంలోని కలహండి ప్రాంతానికి చెందిన బలదేవ్ మాజీ (55) కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో టైల్స్ పనిచేస్తున్నాడు. శుక్రవారం పిఠాపురం బైపాస్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటికి టైల్స్ అతికిస్తూ ఎలక్ట్రికల్ బోర్డుపై ఉన్న స్విచ్ వేస్తున్న సమయంలో కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. సహచర కార్మికుల ఫిర్యాదుతో పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొబ్బరిపీచు ఫ్యాక్టరీలో ప్రమాదం

కడియం, మే 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల గ్రామంలో కొబ్బరిపీచు ఫ్యాక్టరీలో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. సత్యసాయి ఇండస్ట్రీస్ అధినేత కృష్ణసాయికి చెందిన ఫ్యాక్టరీలో జరిగిన ఈ ప్రమాదంలో విద్యుత్ సామాన్లు, ఫైబర్ మెటీరియల్ పూర్తిగా కాలిపోయాయని, సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని కృష్ణసాయి తెలిపాడు. కార్మికులు సెలవు పెట్టడంతో కొద్ది రోజులుగా ఉత్పత్తి నిలిపివేశామని, త్వరలో ఉత్పత్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని, రాత్రి మెటీరియల్ తీసుకువచ్చి ఉంచామన్నారు. ప్రమాదం ఏ విధంగా సంభవించిందో తెలియడం లేదన్నాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చామని, మండపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసినట్టు పేర్కొన్నాడు.



కాలిపోయిన విద్యుత్ పరికరాలు

రూ.80 లక్షల నిధులు దారిమళ్లింపు

ది ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సభ్యుల ఆరోపణ

కార్పొరేషన్ (కాకినాడ), మే 23 (ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లలో ప్రతిభ గల క్రీడాకారుల భవిష్యత్తును కాలరాస్తూ ది ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఏసీఏ నుంచి సుమారు రూ.80 లక్షల నిధులు దారి మళ్లించారని అసోసియేషన్ సభ్యులు బాపిరాజు, సత్యస్వరూప్, నగేష్ ఆరోపించారు. కాకినాడ జయా రెసిడెన్సీలో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ప్రెసిడెంట్ డాక్టర్ శివకుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల వివిధ జోన్ల నుంచి ప్రెసిడెంట్, సెక్రటరీలు హాజరైయ్యారు. శివకుమార్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా అసోసియేషన్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను సభ్యుల ముందుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ఏ పార్మట్లోను టోర్నమెంట్ నిర్వహించకపోగా ఇతర టోర్నమెంట్లలో పాల్గొనే క్రీడా కారులను పక్కనపెట్టడం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా ప్రతిభను పక్కనపెట్టి డబ్బులిచ్చి జట్టులో వేయడం వంటి వాటికి స్వస్తి పలికేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జోక్యం చేసుకుని ఇక్కడ అవినీతిపై విచారణ జరిపించి దోషులపై చర్యలు చేపట్టాలని కోరుతూ తీర్మానం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సుమారు 40 మంది సభ్యులు హాజరై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. మాజీ సెక్రటరీ కె.బాపిరాజు, మాజీ వైస్ ప్రెసిడెంట్ ఎ.ఎస్.స్వరూప్, రాజమండ్రి ఇన్‌చార్జి విజయకుమార్ బాబు, కోనసీమ ఇన్చార్జి ఎవిటి.వర్మ పెద్దాపురం ఇన్‌చార్జి, ఎ.లక్ష్మినారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సభ్యులు

వేడి నీరు పడి..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లప్రోలు, మే 23 (ఆంధ్రజ్యోతి): వేడి నీరు పడడంతో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని శివం హోటల్‌లో పొడికోడి కృష్ణన్ పద్మనాభన్ (53) అనే రవి కొంతకాలంగా పనిచేస్తున్నాడు. ఈనెల 13న వేడినీటి గిన్నెను దింపుతుండగా ప్రమాదవశాత్తు మీద పడింది. వేడి నీరు పడటంతో తీవ్రంగా గాయపడిన అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి అన్న కృష్ణన్ ఫిర్యాదుపై గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త అరెస్ట్

గొల్లప్రోలు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో భార్యపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన భర్తను గొల్లప్రోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. తాకట్టులో ఉన్న సెల్‌ఫోన్ విడిపించుకునేందుకు డబ్బులు అడగా లేవనిచెప్పిన భార్య జ్యోతిపై ఆగ్రహంతో భర్త కిలాడి శ్రీను పామాయిల్ గెలలు కోసే కత్తితో దాడి చేశాడు. శ్రీనును శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

పాము పడగ వలే..



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం రాజులపాలెం గ్రామంలో రైతు పేరిచర్ల నాగరాజు పొలంలో కంద దుంపకు పాము పడగవలే పువ్వు విరిసింది. అబ్బురపరిచే విధంగా ఉన్న దుంపతో కూడిన ఈ పువ్వును చూడటానికి స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి)

పుట్టగొడుగు భలే..



అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పెద్ద భీంపల్లి మూడు ఆర్‌అండ్ ఆర్ కాలనీ కొండమొదలు గ్రామం సమీపాన పొలంలో 8 అంగుళాల పొడవు, 8 అంగుళాల వెడల్పుతో పుట్ట గొడుగు వెలిసింది. దీంతో అటుగా వెళ్లే వారు దీన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి)

గంజాయితో ఐదుగురి అరెస్ట్



ఆలమూరులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

ఆలమూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు పోలీసులు శనివారం గంజాయితో ఐదుగురిని అరెస్టు చేసినట్లు కోర్టులో హాజరుపరిచారు. ఈ వివరాలను ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ విలేకర్లకు వివరించారు. గంజాయితో ఉన్నట్టు సమాచారం రావడంతో పెదపళ్ల శివారు శ్మశానవాటిక వద్ద దాడి చేసి కడియం మండలం మురమండకు చెందిన నూకపెయ్యి దిలీప్, ఆలమూరు మండలం పెదపళ్లకు చెందిన చాపల ప్రసన్నకుమార్, పల్లి కార్తీక్‌కుమార్, కపిలేశ్వరపురం మండలం తాతపూడికి చెందిన ఉందుర్తి ఆనంద్‌కుమార్, కడియం మండలం దుళ్లకు చెందిన మెండి రవికుమార్‌లను అరెస్ట్ చేశారు. ఒక్కొక్కరి వద్ద 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరుపరచినట్టు పేర్కొన్నారు.

తిమ్మాపురంలో బైక్‌ల దొంగ అరెస్ట్

సర్పవరం జంక్షన్, మే 23 (ఆంధ్రజ్యోతి): బైక్‌లను చోరీ చేస్తున్న యువకుడు పోలీసులకు చిక్కాడు. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకలకు చెందిన రచ్చా బొబ్బులు అనే సతీష్‌కుమార్ (20) చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడి పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో బైక్‌ల చోరీలకు పాల్పడాడు. సీఐ డీఎస్ చైతన్యకృష్ణ నేతృత్వంలో తిమ్మాపురం ఎస్ఐ ఆర్‌వీఎన్ మూర్తి ఆధ్వర్యంలో క్రైం పార్టీ సిబ్బందితో రాబడిన సమాచారం మేరకు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం తిమ్మాపురం వై.జంక్షన్ సమీపంలో సతీష్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఆర్‌వీఎస్.మూర్తి తెలిపారు. నిందితుడిని విచారించగా గతంలో అతడిపై పిఠాపురం, సర్పవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీ కేసులు, సామర్లకోటలో గంజాయి కేసులు ఉన్నాయన్నారు. ఎన్టీఆర్ న్యూ బీచ్‌లో మరొక మోటార్ బైక్ చోరీకి పాల్పడినట్లు, అలాగే వెంకట్ అనే మరో వ్యక్తితో కలసి అచ్చంపేట ఏడీబీ రోడ్డులో టెంపుల్‌లో హుండీలో రూ.2000 నగదు కాజేసినట్టు తెలిపారు. 2బైక్‌లు, రూ.2000 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు.

వాగులోకి స్నానానికి వెళ్లి బాలుడి మృతి



సీలేరు వాగులో బాలుడి మృతదేహం

మోతుగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న సీలేరు వాగులోకి స్నానానికి వెళ్లిన ఓ బాలుడు మరణించాడు. మర్రిగూడెం గ్రామానికి చెందిన పి.సంతోష్‌కుమార్(15) ఈనెల 21న సీలేరు వాగులోకి స్నానానికి వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అదే గ్రామానికి చెందిన ధర్మారావు సీలేరులో చేపల వేటకు వల వేయగా శుక్రవారం అందులో చిక్కాడు. దీనిపై డొంకరాయి పోలీసులు కేసు నమోదు చేశారు.

గోదావరిలో జారి పడి వ్యక్తి మృతి

అమలాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైనతేయ నదీ తీరం అల్లవరం మండలం గోపాయిలంక మొండి వద్ద లంకలో ఒక వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ టి.తిరుమలరావు తెలిపారు. అంబాజీపేట మండలం వాకలగరువు గ్రామానికి చెందిన సుంకర దుర్గాప్రసాద్ (44) సోమవారం బోడసకుర్రు శివాలయానికి అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి గోపాయిలంక మొండి వద్ద గోదావరి గట్టు వద్ద మోటారుసైకిల్ పెట్టి బహిర్భూమి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ గోదావరిలో జారి పడి మరణించాడని, మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారని ఎస్ఐ పేర్కొన్నారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తిరుమలరావుఎస్ఐ చెప్పారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆటో బోల్తా

నలుగురికి గాయాలు

సామర్లకోట, మే 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం ఉండూరు శివారు బ్రహ్మానందపురం మండల పరిషత్ పాఠశాల ఎదురుగా రైల్వే కార్మికులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును, విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన 12 మంది కార్మికులు కడియం వద్ద రైలు ట్రాక్ పనుల నిమిత్తం ఆటోలో వెళ్లి పనులు పూర్తి అనంతరం తిరిగి ఉండూరు మీదుగా దుర్గాడ వెళ్తుండగా బ్రహ్మానందపురం సమీపించేసరికి ఆటో నడుపుతున్న డ్రైవర్‌కు రెప్పపాటు కారణంగా ప్రమాదం జరిగినట్టు ప్రత్యక్షసాక్ష్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మిగిలిన గాయపడిన ముగ్గురికి స్థానికంగా ప్రాథమిక చికిత్స నిర్వహించారు. ప్రమాదంలో విద్యుత్ స్తంభం ఛిద్రం అయ్యింది. సామర్లకోట విద్యుత్ లైనమెన్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ వార్డు సభ్యుడు దాడి

కేసు నమోదు

అన్నవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల విషయంలో జరిగిన టీడీపీ కార్యకర్తపై వైసీపీ వార్డు సభ్యుడు దాడి చేయడంతో కొట్లాట కేసు నమోదు చేసినట్టు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా అన్నవరంలో ఉపాధిహామీ పనుల జరిగే చోటకు టీడీపీకి చెందిన సిరపరపు కృష్ణ వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవిని పనులు కేటాయింపు, కొలతలపై ప్రశ్నించగా వారిద్దరి మధ్య స్వల్ప వివాదం జరిగింది. శ్రీదేవి వైసీపీ వార్డు సభ్యుడి సింగంపల్లి రాముకు విషయం చెప్పడంతో రాము, కృష్ణల మధ్య కొట్లాట జరగడంతో అన్నవరం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాయాలపాలైన కృష్ణను తుని ప్రభుత్వా సుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆలయంలో ఆర్డీవో మాధవి పూజలు

అంతర్వేది, మే 23(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి శుక్రవారం అమలాపురం ఆర్డీవో కె.మాధవి కుటుంబ సభ్యులతో విచ్చేశారు. అనంతరం అంతరాలయంలో స్వామిని దర్శించుకుని వేదపండితుల మహదాశీర్వచనం అందుకున్నారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అధికారులు, అర్చకులు అందించారు.

బాలబాలాజీకి పంచామృతాలతో అభిషేకం

మామిడికుదురు, మే 23(ఆంధ్రజ్యోతి): అప్పనల్లి బాలబాలాజీ స్వామివారికి శుక్రవారం పంచామృతాలతో అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. వైనతేయ నదీ జలాలతో స్వామివారికి శుద్ధిచేసి అనంతరం పంచామృతాలతో అభిషేకించారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలి

• వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

ముమ్మిడివరం, మే 23(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. ముమ్మిడివరం మండలం అయినాపురంలో శుక్రవారం ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు వారాలుగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నా ఒక్కరోజు వేతనం కూడా ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కూలీలందరికీ ఆరు నెలల పాటు రూ.6వేలు పించను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్లకు ఇరువైపులా, చెరువుగట్లపైనా ఉన్న కొబ్బరి మొక్కలను పేదలకు పెంచాలన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఇసుకపట్ల మంగాదేవి, బీర వెంకట్రావు, సత్యనారాయణ, నరసింహమూర్తి, ఆనందరావు, వరలక్ష్మీ, శారద, శంకుతల పాల్గొన్నారు.



ముమ్మిడివరం: అయినాపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

పథకం రద్దవ్వకుండా పోరాటం

ఉప్పలగుప్తం, మే 23(ఆంధ్రజ్యోతి): అటు కేంద్రం, ఇటు గ్రామాల్లోని పెత్తందార్లు ఉపాధి హామీ పథకం రద్దుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు ఆరోపించారు. ఉపాధి పథకం రద్దవ్వకుండా పోరాటం చేస్తామన్నారు. శుక్రవారం ఆయన విలసవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీలను కలిశారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి పనిదినాలు 200కు పెంచాలన్నారు. ప్రమాదవశాత్తూ మరణించిన కూలీలకు రూ.5లక్షలు బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికిట్లు, టెంట్లు, గునపం, పార తదితర పనిముట్లు అందించాలన్నారు. ఉదయం 11గంటలకే కూలీలను ఇంటికి పంపించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఇసుకపట్ల మంగాదేవి, బీర వెంకట్రావు పాల్గొన్నారు.

80 అడుగులతో బండారులంక రోడ్డు

- మాస్టర్‌ప్లాన్‌కు లోబడే భవన నిర్మాణాలకు అనుమతులు - నోటీసులు జారీచేసిన అముడా

అమలాపురం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): అమలాపురం నుంచి అంబాజీపేటవైపు వెళ్లే ఏజీ రోడ్డును 80 అడుగులతో అభివృద్ధి చేసేలా మాస్టర్ ప్లాన్ ఆమోదించారు. దాంతో అమలాపురం అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ అమలాపురం పట్టణాన్ని ఆనుకుని ఉన్న పది గ్రామాలకు రోడ్ల అభివృద్ధిపై నోటీసులు జారీ చేసింది. 60రోజుల పాటు సంబంధిత మాస్టర్ ప్లాన్ ప్రతులను గ్రామాల వారీగా ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డుల్లో ప్రదర్శనకు ఉంచారు. దీనిలో భాగంగా బండారులంక రోడ్డును ఈదరపల్లి వంతెన వద్ద నుంచి అంబాజీపేట వరకు 80అడుగుల మేర అభివృద్ధి చేసేలా ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈరోడ్డు 30అడుగుల వెడల్పుతో మాత్రమే ఉంది. దాంతో మరో రెండు రెట్లు మేర రోడ్డును అటూ ఇటూ అభివృద్ధి చేయాల్సి ఉందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఈదరపల్లి నుంచి బండారులంక మీదుగా అంబాజీపేట వెళ్లే రోడ్డును ఆనుకుని ఆక్రమణలు జరిపి పలువురు పక్కా కట్టడాలను సైతం నిర్మించారు. కొందరైతే వ్యాపార కూడళ్లుగా మార్చేశారు. రోడ్డును సైతం ఆక్రమించుకున్న పరిస్థితులు పలుచోట్ల కనిపిస్తున్నాయి. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, వైస్‌చైర్మన్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాస్టర్ ప్లాన్ అమలుచేసేలా నోటీసులు జారీ చేయడంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అమలాపురం పట్టణాన్ని ఆనుకుని ఉన్న పది గ్రామాల్లో రోడ్డును 40అడుగుల నుంచి సుమారు వంద అడుగుల వరకు అభివృద్ధి చేసేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రధానంగా ఏజీ రోడ్డును ఆనుకుని ఆక్రమణలు జరగడంతో ఆయా స్థలాలను, నిర్మించిన షాపులను కొందరు వ్యాపారాత్మకంగా ఏటా లీజులకు ఇస్తున్నారు. మరికొందరైతే లక్షలాది రూపాయలతో విక్రయాలు జరుపుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇదిలా ఉండగా 80అడుగుల మేర రోడ్డును అభివృద్ధి చేసే ఈదరపల్లి నుంచి అంబాజీపేట వరకు పలువురు గృహాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. దాంతో ఇప్పటికే సమాచారం తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు. 60రోజులు గడువు ఇచ్చి అభ్యంతరాలు తెలపాలని అముడా ప్రకటించిన నేపథ్యంలో పలువురు అభ్యంతరాలు తెలిపేందుకు ప్రయత్నిస్తుంటే మరికొందరు ప్రత్యామ్నాయ మార్గాలవైపు దృష్టి సారించారు. కొందరు నాయకులైతే ప్రజా ప్రతినిధులను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే మాస్టర్ ప్లాన్‌ను ఆమోదించడం జరిగిందని ప్రజాప్రతినిధులు స్పష్టం చేయడంతో ఆయా నాయకులు వెనుదిరిగా.



అమలాపురం నుంచి బండారులంక మీదుగా అంబాజీపేట వెళ్లే ఏజీ రోడ్డు

మాస్టర్ ప్లాన్ మేరకే అనుమతులు

మాస్టర్ ప్లాన్ నిబంధనల మేరకే భవన నిర్మాణాలకు, లేఅవుట్‌లకు అనుమతులు జారీ చేస్తామని అముడా చైర్‌పర్సన్ అల్లాడ స్వామినాయుడు ప్రకటించారు. గ్రామ పంచాయతీల పరిధిలో 300 చదరపు మీటర్లలోపు స్థలంలో వ్యక్తిగత నివాస భవనాల అనుమతులు సైతం మాస్టర్ ప్లాన్‌కు లోబడే జరుగుతాయన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రతిపాదిత రోడ్ల మార్గంలో ఏవిధమైన అనుమతులు ఇవ్వరాదని సూచించారు. పట్టణాన్ని ఆనుకుని ఉన్న 10గ్రామాలకు ఇవే నిబంధనలు వర్తిస్తాయన్నారు. మెట్రో పాలిటన్ రీజియన్‌అండ్‌అర్బన్ డెవప్మెంట్ అథారిటీస్ యాక్టు 2016ను అనుసరించి ప్రతిపాదిత రోడ్ల ప్రకారం నిర్మాణాలకు అనుమతులిస్తామన్నారు.

నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు చెక్



గుడిమెళ్లంకలో ఏర్పాటుచేసే సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే

మలికిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం గుడిమెళ్లంకలో ఏర్పాటుచేయు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిమూల, గుడిమెల్లంకలోని సబ్‌స్టేషన్లతో పాటు శంకరగుప్తం సబ్‌స్టేషన్ కూడా ఏర్పాటైతే భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించినవారమవుతామన్నారు. ఇప్పటికే లక్కవరం, మలికిపురం, రాజోలు సబ్‌స్టేషన్లలో 5ఎంవీఏ నుంచి 8ఎంవీఏలకు అప్‌గ్రేడ్ చేయడం ద్వారా చాలావరకు లోఓల్టేజీ సమస్య తీరందన్నారు. పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని, వాటి కోసం సీఎండీతో మాట్లాడానని, అవి వస్తే ఆ సమస్యలు కూడా పూర్తిస్థాయిలో తీరతాయన్నారు. గుడిమెళ్లంకలో రక్షిత మంచినీటి పథకం వద్ద ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులతో మరో ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా తాగునీరు ఇబ్బందులు కూడా తొలగుతాయన్నారు. ఇప్పటికే రిజర్వాయర్ వద్ద విద్యుత్ సమస్య లేకుండా 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, దిరిశాల బాలాజీ, మల్లిపూడి సత్తిబాబు, సర్పంచ్ విజయకుమారి, తిరుమల సుబ్బారావు, చెల్లింగి సత్యనారాయణ, కలగత ఏసురత్నం, బత్తుల రాజేశ్వరప్రసాద్, అంజలి, విద్యుత్ ఏఈ ప్రసాద్, ముత్యాల శ్రీను, దేశినీడి తాతాజీ, రాపాక నవరత్నం తదితరులు పాల్గొన్నారు.

కోడలను వేధించిన అత్త, మామలపై కేసు

పి.గన్నవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): కోడలను వేధించిన ఘటనలో అత్త, మామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వాడ్రేవపల్లి శివారు చాకలిపాలేనికి చెందిన కొప్పాడి తిరుపతమ్మ భర్త ఉపాధి నిమిత్తం చెరువుల వద్ద ఉంటున్నాడు. అత్త, మామలు వద్ద తిరుపతమ్మ ఉంటుంది. ఈనెల 19న కోడలు, అత్త, మామలు మధ్య జరిగిన వివాదంలో కోడలిపై దాడిచేసి ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని సూచించారు. తిరుపతమ్మ వైద్యం నిమిత్తం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదచేశామని ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాట్రేనికోన, మే 23(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. బైక్‌పై పల్లంకుర్రు వైపు వెళ్తున్న అయినవిల్లి మండలం పోతుకుర్రుకు చెందిన సాగి శ్రీనివాసనరసింహరాజు(50) ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. తలకు బలమైన గాయంకావడంతో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నరసింహరాజు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

మండపేటలో అత్యధికంగా 39.2 మిల్లీమీటర్ల వర్షపాతం

అమలాపురంటౌన్, మే23(ఆంధ్రజ్యోతి): మండపేటలో అత్యధికంగా 39.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మామిడికుదురులో 3.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సగటున 17.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురంలో 17 మిల్లీమీటర్లు, రాయవరం 36.8, రామచంద్రపురం 17, ఆలమూరు 8.4, రావులపాలెం 17.6, కొత్తపేట 30.4, కపిలేశ్వరపురం 27.2, కె.గంగవరం 13.2, ఐ.పోలవరం 13.6, ముమ్మిడివరం 26.2, అయినవిల్లి 27.6, పి.గన్నవరం 17.8, అంబాజీపేట 16.2, అల్లవరం 13.8, అమలాపురం 13.2, ఉప్పలగుప్తం 18.2, కాట్రేనికోనలో 36.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఖత్తర్‌లో కష్టాలు. ఎంపీ సహాయంతో స్వగ్రామం..



స్వగ్రామానికి చేరుకున్న కుటుంబ సభ్యులతో మహిళ నాగదుర్గ

అంబాజీపేట, మే 23(ఆంధ్రజ్యోతి): ఖత్తర్‌లో నరకయాతన పడుతున్న మహిళ ఎంపీ హరీష్ సహాయంతో ఆమె స్వగ్రామం చేరుకుంది. అంబాజీపేట మండలం తొండవరానికి గ్రామానికి చెందిన ఉందుర్తి నాగదుర్గ గత ఏడాది 29న సమీప బంధువులతో సహకారంతో ఖత్తర్ వెళ్లింది. 31 ఖత్తర్ చేరుకుని అక్కడున్న ఓ మేడమ్ వద్ద వంట పనికి చేరింది. నాలుగు నెలలు తర్వాత మేడమ్ కుమార్తె వచ్చి ఖత్తర్లో ఓ సిటీలో ఉంటున్న తన ఇంటికి కుక్ పనికి దుర్గను తీసుకువెళ్లింది. రెండు నెలలు అనంతరం తిండి పెట్టకుండా భర్త ప్రశాంత్, పిల్లలు, బంధువులతో ఫోన్ మాట్లాడకుండా దుర్గను చిత్రహింసలకు గురిచేసింది. దీంతో దుర్గ ఈవిషయంపై భర్తకు వాట్సాప్ మేసేజ్ పంపించింది. దీంతో భర్త ప్రశాంత్ ఈవిషయాన్ని స్థానిక సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఉపసర్పంచ్ దిగుమర్తి చిట్టిబాబుకు వివరించాడు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఈవిషయాన్ని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాదుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలకు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో ఈనెల 22వ తేదీ అర్ధరాత్రి స్వగ్రామం తొండవరం క్షేమంగా చేరుకున్నట్టు నాగదుర్గ తెలిపింది.

ధ్రువపత్రాలు జారీ

యానాం, మే 23(ఆంధ్రజ్యోతి): సెంటాక్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో కుల, నివాస తదితర సర్టిఫికెట్లు కార్యాలయ పని దినాలతో పాటు ఈనెల24,31, జూన్ 7వ తేదీల్లో జారీ చేస్తామని యానాం డిప్యూటీ తహశీల్దార్ ఆర్.జ్యోతి వెంకటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు.

యోగాంధ్రప్రదేశ్ లక్ష్యంగా కార్యక్రమాలు

జాయింట్ కలెక్టర్ నిషాంతి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం, మే 23(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నెల రోజులు అందరి భాగస్వామ్యంతో ప్రత్యేక యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జూన్ 21న రికార్డు స్థాయిలో యోగా చేయించాలనే లక్ష్యంలో భాగంగా ప్రతీరోజు ఉదయం 7నుంచి 8గంటల వరకు యోగా సాధన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆయుష్ విభాగం యోగాశిక్షణ కార్యక్రమాల్లో యోగా గురువులు, మాస్టర్ ట్రైనీల ద్వారా ఐదేసి రోజుల పాటు శిక్షణలు ఇస్తామన్నారు. ఈనెల27న మాస్ మీడియాకు యోగాతో అనారోగ్యాన్ని జయించినా, యోగాసాధనతో విజయ తీరాలకు చేరిన కథనాలను విడుదల చేయాలని, అదేరోజున ప్రజా ప్రతినిధులతో ర్యాలీ నిర్వహించాలన్నారు. ఈనెల 27, జూన్ 3,16 తేదీల్లో పర్యాటకుల ద్వారా యోగాంధ్రపై క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. ఈనెల28న మండలస్థాయిలో ర్యాలీలు నిర్వహించాలని, జూన్ 2న రంగోళీ పోటీలు, 4న గ్రామ, మున్సిపల్ స్థాయిలో కార్యక్రమాలు, జూన్ 5నుంచి 7వరకు స్వయం సహాయక సంఘాలు, 13న రైతుల యోగా, 16న ఫ్యామిలీ యోగా, 17న స్పెషల్ యోగా వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, సీపీవో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఆయుష్ మెడికల్ అధికారి విజయకుమారి, దేవదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, డీపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, డీఈవో డాక్టర్ షేక్‌సలీంబాషా, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం బ్రాంచ్‌కు ప్రత్యేక స్థానం

అమలాపురం టౌన్, మే23(ఆంధ్రజ్యోతి): లైఫ్‌ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అమలాపురం బ్రాంచ్‌కు ఉన్న ప్రత్యేక స్థానాన్ని కొనసాగించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని రాజమహేంద్రవరం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు పేర్కొన్నారు. ఎస్డీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అమలాపురం బ్రాంచ్‌కు విచ్చేసిన సాహుతో పాటు మార్కెటింగ్ మేనేజర్ కె.వెంకటేశ్వర్లు, సేల్స్ మేనేజర్ ఎస్ఎస్ శర్మలను అమలాపురం ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఇండియా (ఏఐవో) యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు ఆధ్వర్యంలో దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. డివిజన్‌లో అమలాపురం బ్రాంచ్‌కు ఉన్న ప్రత్యేక స్థానాన్ని వక్తలు కొనియాడారు. అమలాపురం బ్రాంచ్ మేనేజర్ కె.సుధార్‌రెడ్డి, అంబాజీపేట మేనేజర్ రవీంద్రకుమార్, ఏబీఎం ప్రసన్నకుమార్, యూనియన్ కోశాధికారి బి.శివస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.నాగేంద్రకుమార్, కార్యదర్శి జి.వినాయకరావు, మధు, ఏసుదాస్, శ్రీనివాస్‌గౌడ్, వీరాస్వామి, శ్రీనివాసరావు, కేఎన్ శెట్టి, శీలం లంకేశ్వరుడు, యోహాన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

అమలాపురం టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న తల్లికి వందన, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ రెయ్యి నవీన్‌కుమార్ పేర్కొన్నారు. అనుసంధానం బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం జీఎస్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ ప్రకాష్‌కు అప్పగించినట్టు ఆయన తెలిపారు. సచివాలయ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో పోస్టల్ డిపార్టుమెంట్ జూన్ 5వ తేదీలోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్పీసీఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు.

అసభ్య పోస్టింగ్స్ పెడితే చర్యలు: సీఐ

రాజోలు, మే 23(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టింగులు పెడితే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ హెచ్చరించారు. ఈసందర్భంగా రాజోలులో సర్కిల్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో కులాలను, మతాలను దూషిస్తూ, విద్వేషాలు రెచ్చగొట్టేవిధంగా, ఆడవారిని కించపరిచే విధంగా పోస్టింగ్‌లో పెడితే చర్యలు తప్పవన్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో పోలీసులమని చెప్పి వీడియో కాల్స్ చేసిన వారిని నమ్మవద్దని కోరారు. ఇవన్నీ సైబర్ నేరగాళ్ల పన్నాగాలు మాత్రమేనని తెలిపారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబరు 1930 లేదా 112కు సమాచారం ఇవ్వాలని సీఐ నరేష్‌కుమార్ కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే



అర్జీదారుల సమస్య వింటున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. శుక్రవారం అమలాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చినవారు ఎమ్మెల్యే ఆనందరావును స్వయంగా కలిసి 48అర్జీలను అందించారు. వారి సమస్యలను సానుకూలంగా విన్న అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల అర్జీలు పరిష్కారం అయ్యే వరకు వాటిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లుల పోలయ్య, పొలమూరి ధర్మపాల్, పిచ్చిక శ్యామ్, భాస్కర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయాల్లో బార్లు, మద్యంషాపులు తెరవాలి

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్

అమలాపురం, మే 23(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు, బార్లు నిర్ణీత సమయాల్లో మాత్రమే విక్రయాలు జరపాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో మొత్తం 146మద్యం దుకాణాలు, 10 బార్లు ఉన్నాయని, వీటిని ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అదేవిధంగా బార్లను ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరచి విక్రయాలు చేపట్టాలని, ఇందుకు విరుద్ధంగా ముందుగా గానీ, సమయం దాటిన తరువాత గానీ తెరిచి ఉంచి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు జిల్లాలో ఉన్న సీఐ, ఎస్ఐలకు సమయపాలనపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈరోజు అమలాపురం స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం, నాటుసారా, మొత్తం 105 కేసులకు సంబంధించి 18.90 లీటర్ల నాటుసారా, 155.505 లీటర్ల మద్యాన్ని అమలాపురం టౌన్ వీఆర్వో మహ్మద్‌జహీర్ బతుల్లా, నల్లమిల్లి వీఆర్వో జి.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ధ్వంసం చేసిన కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ పాల్గొన్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎక్సైజ్ నేరాలను అరికట్టేందుకు పెట్రోలింగ్

ముమ్మిడివరం, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్‌ఎక్సైజ్ నేరాలను అరికట్టేందుకు రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్టు ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్‌స్టేషన్ ఇన్‌చార్జి కె.రవితేజ తెలిపారు. మద్యం షాపుల్లో ఉదయం 10నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం విక్రయాలు జరపాలన్నారు. ఈనిబంధనను ఉల్లంఘించకుండా ఉండేందుకు ముమ్మిడివరం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లోని 15షాపుల వద్ద సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



అయినవిల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం విలస గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. తరగతి గదుల్లో చేసిన అల్లర్లను, మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. ఆ నాటి గురువులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందం గడిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా నీరందిస్తాం: శ్రీనివాస్



రాజోలు, మే23(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలో ఎస్ఈ గోపీనాథ్‌తో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ శుక్రవారం పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వచ్చే ఖరీఫ్, రబీ కాలానికి రైతులకు ఇబ్బంది కలగకుండా పంట పొలాలకు నీటిని సరఫరా చేసేందుకు, డ్రెయిన్లు ముంపునకు గురికాకుండా మురికినీరు పారుటకు పలు పనులపై చర్చించామన్నారు. లొల్ల లాకుల పునర్నిర్మాణం కోసం మురుగునీరు పంట పొలాల్లో వెళ్లకుండా శంకరగుప్తం డ్రెయిన్ మురుగునీటిని సముద్రంలోకి పంపు హౌస్ ద్వారా లిఫ్టింగ్ చేసే అవకాశానికి ప్రతిపాదనలు ఎస్ఈ గోపీనాథ్‌కు సూచించారు. అప్పర్ కౌశిక రైట్‌అరం డ్రెయిన్, కుమ్మరికాల్వ డ్రెయిన్, గౌతమీ డ్రెయిన్ల పూడికతీతపై చర్చించామన్నారు.

పీహెచ్‌సీని పరిశీలించిన బీజేపీ నాయకులు

అంతర్వేది, మే 23(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి పీహెచ్‌సీని బీజేపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. 2020లో రూ.1.50కోట్లతో నిర్మాణం చేపట్టిన భవనం అసంపూర్తిగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం నిధులను దారిమళ్లించడంతో భవనాలు అసంపూర్తిగా మిగిలాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ ఆరోపించారు. ఆసుపత్రి విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. బీజేపీ డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, ప్రధాన కార్యదర్శి బోనం నాయుడు, ఇందుకూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్లు ప్రారంభం

యానాం, మే 23(ఆంధ్రజ్యోతి): యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో 2025-26ఏడాదికి వివిధ ట్రేడ్స్‌లో అడ్మిషన్లు ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణా సుధాకర్ తెలిపారు. యానాం ప్రాంతానికి చెందిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాలికలకు కంప్యూటర్ ఆపరేటర్‌అండ్‌ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ ఏడాది కోర్సులు, బాలురకు వైర్‌మెన్, మెకానిక్ మోటార్‌వెహికల్ రెండేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాలకు ఐటీఐ కార్యాలయం పనిదినాల్లో, సెల్: 0884-2951001, 9491441164ను సంప్రదించాలన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్‌గా శ్రీనివాసరావు



ముమ్మిడివరం, మే 23(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్‌గా కోన వెంకటశ్రీనివాసరావు నియమితులయ్యారు. కోన శ్రీనివాసరావు 2008 నుంచి 2016 వరకు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ ప్లీడర్‌గా పనిచేశారు. నగరపంచాయతీ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావుకు కోరశిక సత్తిబాబు, పళ్ల వీరబాబు, వస్త్రాల వీరన్న, మట్ట సత్తిబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

బీజేపీ నూతన కార్యవర్గం

మలికిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): మేడిచర్ల చాణక్య బీజేపీ మలికిపురం మండలం అధ్యక్షుడిగా నూతన కార్యవర్గాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో విశ్వేశ్వరాయపురంలో ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా మేడిచర్ల చాణక్య, ప్రధాన కార్యదర్శులుగా కట్టా వాసు, కె.రామచంద్రరాజు, ఉపాధ్యక్షులుగా ఎ.బాలాజీ, డి.రామలింగరాజు, ఆరేటి శ్రీను, పి.మోహన్‌లాల్, ఎం.తాతంబాబు, తోట ఉమామహేశ్వరి, కార్యదర్శులుగా దళం సత్యనారాయణ, తాడి రవీంద్ర, పి.సీతాదేవి, ఎం.సరస్వతి, ఎం.అశ్విని, ఎ.సత్తిబాబు, కోశాధికారిగా కలగత శిరీష, సోషల్ మీడియా కన్వీనర్‌గా గెద్దాడ గణేష్‌లను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా అడబాల సత్యనారాయణతో పాటు అడబాల రాంబాబు, ఇందుకూరి అచ్యుతరామరాజు, శివరామరాజు, కె.కనకేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాను పాఠ్యాంశంగా చేర్చడం అభినందనీయం

మామిడికుదురు, మే 23(ఆంధ్రజ్యోతి): యోగాను పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేరుస్తానని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడం అభినందనీయమని లూటుకుర్రు ఉపసర్పంచ్, యోగాశిక్షకుడు కోట బ్రహ్మానందం పేర్కొన్నారు. మామిడికుదురులో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యోగాతో చదివింది మెదడుకు చేరుతుందని, శారీరకంగా, మానసికంగా విద్యార్థులు ధృడంగా తయారవుతారన్నారు. సీఎం నిర్ణయాన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నారని తెలిపారు.

ప్రతీ నిరుపేదను ఆర్థికంగా ఆదుకుంటాం: ఎమ్మెల్యే

పి.గన్నవరం, మే 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో ఆపదలో ఉన్న ప్రతి నిరుపేదను ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో 14మందికి రూ.9,59,980 సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 231మందికి రూ.1.74కోట్లు అందిచామన్నారు. చెప్పారు. కార్యక్రమంలో మద్దాల సుబ్రహ్మణ్యం, శిరిగినీడి వెంకటేశ్వరరావు, చిట్టూరి శ్రీనివాస్, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజు, అరిగెల బాలరామ్మూర్తి, అన్నాబత్తుల హనుమాన్, అల్లాడ రవి, యడ్ల ఏసు, తాటికాయల శ్రీనివాసరావు, తాటికాయల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సు

అమలాపురం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాలకు ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులకు విశేష ఆదరణ లభిస్తుందని అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈనెల24న అమలాపురం డిపో నుంచి ప్రత్యేకంగా ఇంద్ర ఏసీ బస్సును ఏర్పాటుచేశామన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. వివరాలకు రిజర్వేషన్ కౌంటర్ ఇన్‌చార్జి ఎస్.వరహాలబాబు, సెల్ 9676266777, రిజర్వేషన్ కౌంటర్ 9959225576ను సంప్రదించాలన్నారు.

రోగులతో వైద్యులు మంచిగా మెలగాలి

రాజోలు, మే 23(ఆంధ్రజ్యోతి): రాజోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులతో వైద్యులు మంచిగా మెలగాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వైద్య సిబ్బందికి సూచించారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. పూర్తిస్థాయి గైనకాలజిస్టు అవసరం ఉందని, అధికారులతో మాట్లాడానని, త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. డయాలసిస్ సెంటర్‌ను సందర్శించారు. ఇక్కడున్న 5యూనిట్లకు అదనంగా మరో 3యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సర్పంచ్ రేవు జ్యోతి, కాట్నా రాజు, దిరిశాల బాలాజీ, గుండాబత్తుల తాతాజీ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మామిడికుదురు, మే 23(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంకలోని గిడుగువారి పాలెంలో యూనివర్సల్ లైఫ్‌స్టైల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ఆసుపత్రి వైద్యులు వి.మురళీధర్, కాదాలక్ష్మి ఆధ్వర్యంలో వంద మందికి ఉచితంగా కిడ్నీ, లివర్, పొట్ట, గుండె, ఊపిరితిత్తుల పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరనీడి చిన్నీ, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి శివరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

'రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన వైసీపీ'

అమలాపురం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆస్తులను విక్రయించి ఆర్థిక వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తంచేసిందని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ విమర్శించారు. ఈదరపల్లిలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం జిల్లాస్థాయి బహుజన సంకల్ప సభ జిల్లాశాఖ అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం ప్రజలను నిలువునా దోచుకుందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఇంతవరకు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి కొల్లాబత్తుల సత్యం, గెడ్డం సంపదరావు, అశోక్, ఉమ్మడి జిల్లాల ఈసీ సభ్యుడు బత్తుల లక్ష్మణరావు, జిల్లా ఇన్‌చార్జి కె.లక్ష్మీబాను, ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు, కార్యదర్శి జాన్‌మోషే, అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, జిత్తుక సత్యనారాయణ, రమణ, ఆకుమర్తి భూషణం, బడుగు భీమేశ్వరరావు, తాడి రాంబాబు, జి.కొత్తయ్య పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.06 లక్షలు

ఆత్రేయపురం, మే 23(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధసేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,06,000 లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



మండపేట టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ప్రజా సమస్యల పరిష్కారమే

ప్రజా ఫిర్యాదుల లక్ష్యం

● ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కారవేదిక లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. మండపేట పట్టణ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. చాలామంది రెవెన్యూ, డ్రైనేజీతోపాటు భూముల రీసర్వే వల్ల కలిగిన ఇబ్బందులు గురించి ఫిర్యాదులు వచ్చాయి. ఆయా శాఖల అధికారులకు సమస్యలు పరిష్కరించాలని వేగుళ్ల ఆదేశించారు.



రావులపాలెంలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపుపార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలవద్ద నుంచి వినతులు స్వీకరించి ఆయా శాఖల వారీగా వెంటనే వాటిని పరిష్కరించాల్సిందిగా ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధి పనులు సమర్థవంతంగా నిర్వహించాలి

● కొత్త పేట ఆర్డీవో శ్రీకర్
● ఆలమూరులో ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు



ఆలమూరులో ఉపాధి పనుల రికార్డులను పరిశీలించి వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆలమూరు, మే 23(ఆంధ్రజ్యోతి):ఉపాధి పనులు సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అన్నారు. ఆలమూరు మండలంలో శుక్రవారం కొత్తపేట ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆలమూరు మండలం విచ్చేసిన ఆయన పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఓపీ ఎలా ఉంది, మందుల సరఫరా, ఆపరేషన్ థియేటర్ తదితర అంశాలను స్థానిక వైద్యులు సాయికిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న ప్రజలతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఆలమూరులో జరుగుతున్న జాయతీ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించారు. ఆలమూరు బోణిచెరువు తవ్వకాలలో ప్రతీరోజు ఎంతమంది శ్రామికులు పనిచేస్తున్నారనే విషయాలతో పలు వివరాలను ఎంపీడీవో ఎ.రాజు, ఎంపీవో అరుణ్‌కుమారిని అడిగితెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆలమూరు సిద్దార్థహైస్కూల్ రోడ్డులోని పలు డ్రైన్లను పరిశీలించి వాటిని తక్షణం క్లీన్ చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆలమూరు కాలువవద్ద ఉన్న 22ఏలో ఉన్న రైతు భూమిని ఆర్డీవో శ్రీకర్ పరిశీలించి 22ఏ నుంచి తొలగించి రైతుకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వేసవిలో సర్వే పనులు అధికంగా ఉంటాయని ఈ సమయంలో సర్వే సిబ్బంది మరో మండలానికి పంపించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని పరిశీలించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, డీటీ సుబ్బరాజు, ఎంపీవో అరుణ్‌కుమారి, నాయకులు రామానుజుల శేషగిరిరావు, నాతి కుమార్‌రాజా పాల్గొన్నారు.

వారణాశి సినీ పోస్టర్ ఆవిష్కరణ

రావులపాలెం, మే 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయంవద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వారణాశి సినీపోస్టర్‌ను ఆవిష్కరించారు. తణుకుకు చెందిన అడబాల రాహుల్ రాయ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం విజయవంతం కావాలని బండారు అన్నారు.



పెదపళ్ల వద్ద ఉన్న గెయిల్ గ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించిన ఆర్డీవో శ్రీకర్

గెయిల్ గ్యాస్‌ప్లాంట్‌ను సందర్శించిన ఆర్డీవో

● రెడ్‌జోన్ పరిధి పరిశీలన

ఆలమూరు, మే 23(ఆంధ్రజ్యోతి): గ్యాస్ అథార్టీ ఆఫ్ ఇండియాకు సంబంధించిన గ్యాస్ ప్లాంట్ పరిధిని రెడ్‌జోన్‌గా ప్రకటించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆలమూరు మండలం పెదపళ్ల పరిధిలో గెయిల్ గ్యాస్ ప్లాంట్ (ఆలమూరు-మండపేటరోడ్డులో)ఉంది. ఈ ప్లాంట్ పరిధిని రెడ్‌జోన్‌గా చేయాలని గెయిల్ సంస్థ దరఖాస్తు చేసుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పెదపళ్ల గ్యాస్ ప్లాంట్‌ను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. గ్యాస్ ప్లాంట్, చుట్టూ ఉన్న ప్రాంతాలను పరిశీలించి ఈమేరకు ఉన్నతాధికారులకు వివరించనున్నారు. గ్యాస్ ప్లాంట్ నుంచి గ్యాస్ ఏ ప్రాంతాలకు సరఫరా అవుతుంది తదితర అంశాలపై ఆర్డీవో శ్రీకర్ గెయిల్ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. ఆర్డీవో శ్రీకర్ వెంట ఆలమూరు డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు, మండల సర్వేయర్ ప్రభావతి, ఆర్ఐ రామయ్యమ్మ పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.గంగవరం, మే 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కె.గంగవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పాడైపోయిన 11కేవీ బ్రేకర్ స్థానంలో కొత్త బ్రేకర్‌ను ఏర్పాటు చేయడంతో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందని రామచంద్రపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు, ఏఈ భాస్కరకుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో కె.గంగవరం, తామరపల్లి, సత్యవాడ, కుందూరు గ్రామాల గృహ వినియోగదారులకు, వ్యవసాయ వినియోగదారులకు, దంగేరు వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని ఒక ప్రకటనలో కోరారు.

అపర భగీరథుడు కాటన్ మహాశయుడు : ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, మే23 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు కాటన్ మహాశయుడు అని రాష్ట్ర అంచనాలకమిటీ ఛైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిన కోరుమిల్లిలో గోదావరి నదీతీరాన ఏటిగట్టుపై రిటైర్డ్ హెచ్‌ఎం చిక్కం సూర్యనారాయణ మాష్టారు నూతనంగా నిర్మించిన కాటన్‌దొర విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థుల సమక్షంలో సూర్యనారాయణ మాష్టారు విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాటన్‌దొర మహాశయుడి విగ్రహాన్ని నెలకొల్పడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ళ కాటన్‌దొర విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విగ్రహదాత సూర్యనారాయణ మాష్టారును అభినందించారు. గ్రామసర్పంచ్ ఆచం ట సత్యనారాయణ, మండల జనసేన అధ్యక్షుడు తుట్టపు నాగరాజు, కొండిశెట్టి నాగేశ్వరరావు, మోటుపల్లి బాపిరాజు, వెలుగుబంటి ఏసుదాసు, వీరభద్రం, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



చినకోరుమిల్లిలో కాటన్ విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి



పి.శేషగిరిరావు(ఫైల్)

కె.గంగవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అముజూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పి.శేషగిరిరావు మృతి చెందారు. వారం రోజులక్రితం ఈయన రామచంద్రపురం నుంచి అముజూరు గ్రామం వస్తూ పామర్రువద్ద బైక్ అదుపుతప్పి ప్రమాదం బారిన పడ్డారు. అప్పటి నుంచి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారంరాత్రి మృతి చెందాడు. ఆయన పార్థీవ దేహాన్ని అముజూరుకు తరలించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహమైంది. అముజూరులో శేషగిరిరావు పార్థీవ దేహానికి తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, కూళ్ల నీటిసంఘం అధ్యక్షుడు ఎ.గోపాలకృష్ణలు నివాళులర్పించారు.

గాడ్‌కు సోదరి వియోగం



పెదపాటి సుబ్బలక్ష్మి (ఫైల్)

రాయవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గ పీఠాధిపతి గాడ్‌కు సోదరి వియోగం కలిగింది. గాడ్ సోదరి పెదపాటి వెంకట సూర్య సుబ్బలక్ష్మి (85) అనారోగ్యంతో వెదురుపాకలో ఆమె స్వగృహంలో మృతి చెందారు. సుబ్బలక్ష్మి భర్త పెదపాటి వీరభద్రరావు న్యాయ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు. సుబ్బలక్ష్మికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుబ్బలక్ష్మి అంత్యక్రియలు రాజమహేంద్రవరంలో నిర్వహించారు. సుబ్బలక్ష్మి మృతదేహానికి వెదురుపాకలో పలువురు నివాళులర్పించారు. సుబ్బలక్ష్మి కుమారుడు పీఎస్ఆర్ఎస్ఎస్‌బీ శ్రీనివాసమూర్తి, కోడలు విజయదుర్గ జూనియర్ కళాశాల డైరెక్టర్ సత్యకనకదుర్గను పలువురు పరామర్శించారు.

27న ఉపాధి భవన్‌లో ఉద్యోగమేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ),మే23 (ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం పట్టణంలో ఉపాధి భవన్‌లో ఈనెల 27న కార్పొరేట్ కంపెనీలచే ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం 9.30కు కాంసెంట్రిక్స్, డబ్ల్యు.ఎన్.ఎస్. ఫాక్స్‌కాన్, హుండయ్ మోబీస్ తదితర కంపెనీలచే నియామకాలు జరుపుతాయన్నారు. 18 నుంచి 27ఏళ్లలోపు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు విశాఖకు చెందిన కాంసెంట్రిక్స్, డబ్ల్యుఎన్ఎస్ కంపెనీలలో ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగ నియామకాలకు అర్హులని తెలిపారు. బెంగుళూరుకు చెందిన ఫాక్స్‌కాన్ కంపెనీలో ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 27 ఏళ్లలోపు వయస్సు గల మహిళలకు ఉద్యోగ నియామకాలు జరుగుతాయన్నారు. పెనుగొండకు చెందిన హుండయ్ మోబిస్ కంపెనీలో ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ చదివిన 18 నుంచి 27 ఏళ్లలోపు పురుష అభ్యర్థులకు ప్రొడక్షన్ విభాగంలో నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9515481671లో సంప్రదించాలని కోరారు.


ఘనంగా షిర్డీ సాయిబాబా వార్షికోత్సవం

మండపేట, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారపూడిలో వున్న షిర్డిసాయి బాబా వారి ఆలయ 23వ వార్షికోత్సవంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తిప్పాని కుటుంబ సభ్యులు, సాయి భక్తులతో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషే కాలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయంవద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వ్యక్తికి వారం రోజులు జైలు

మండపేట, మే23(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం జెడ్.మేడపాడులో ఈనెల 5న నిర్వహించి డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వ్యక్తికి ఆలమూరు కోర్టులో వారం రోజులపాటు జైలుశిక్ష విధించిందని రూరల్ ఎస్.ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మండపేట మండలం జెడ్.మేడపాడువద్ద ఈనెల 5న వాహనాలు తనిఖీల్లో భాగంగా వల్లి దుర్గారావు మద్యంతాగి వాహనం నడుపు తుండగా పట్టుపడ్డాడు. అతడిపై కేసు నమోదుచేసి ఆలమూరు కోర్టులో ఈనెల 23న హాజరుపరచగా న్యాయమూర్తి ఐ.ప్రవీణ్‌కుమార్ నిందితుడికి వారంరోజులపాటు జైలుశిక్ష విధించారని ఎస్.ఐ తెలిపారు.

మంత్రి నిమ్మలను కలిసిన లీలాకృష్ణ



అమరావతిలో మంత్రిని కలిసిన వేగుళ్ల లీలాకృష్ణ

మండపేట, మే 23(ఆంధ్రజ్యోతి): ఏపీఐడీసీ ఛైర్మన్‌గా నియమితులైన వేగుళ్ల లీలాకృష్ణ శుక్రవారం రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన ఛైర్మన్‌గా నియమితులైన లీలాకృష్ణ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మంత్రిని కలిసి సాగునీటి సమస్యలు రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి చర్చించారు. అనంతరం మంత్రి నూతన ఛైర్మన్ లీలాకృష్ణను అభినందించారు.

వైభవంగా ఆంజనేయస్వామి కల్యాణం

కె.గంగవరం, మే23(ఆంధ్రజ్యోతి): కోటిపల్లిలోని సువర్చల సమేత ఆంజనేయ స్వామివారి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పప్పుల గువ్వరాజు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామి వారి కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు

ఆత్రేయపురం, మే 23(ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నిచర్యలు చేపడుతున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురం మండలం కట్టుంగవద్ద గన్నవరం కాలువపై ఉన్న ఆర్ఎస్ఎస్ ఛానల్‌పై రూ.10లక్షలతో నిర్మిస్తున్న డీపీ ఇల్లేట్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన నిర్వహించారు. ప్రాజెక్టు కమిటీ వైస్‌ఛైర్మన్ కరుటూరి నరసింహరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో రైతులను పూర్తిగా విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తుందన్నారు. రైతుల సాగుకు నీటి ఇబ్బందులు లేకుండా అన్నిచర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఈ నాగేంద్రకుమార్, ఏఈ వెన్నా మాధవ్, నాయకులు కూసంపూడి రామకృష్ణంరాజు, దొడ్డపనేని త్రినాధ్, జుజ్జవరపు హరిబాబు పాల్గొన్నారు.



లొల్ల వద్ద డీపీ ఇల్లేట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రాయితీపై 24.5 టన్నుల పశువుల దాణా పంపిణీ



పెనికేరులో రైతులకు దాణా పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి వెంకట్రావు

ఆలమూరు, మే 23(ఆంధ్రజ్యోతి): పశుపోషణ ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై పశువుల దాణా అందించే కార్యక్రమం చేపట్టింది. ఆలమూరు మండలంలో 24.5టన్నుల పశువుల దాణాను రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. రాయితీపై అందించే దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్థకశాఖాధికారి వెంకట్రావు, ఆలమూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత సూచించారు. బస్తా దాణా రూ.1110లు కాగా రైతులకు 50శాతం రాయితీపై రూ.555లకు అందిస్తున్నట్లు వారు వివరించారు. జొన్నాడలో రైతులకు దాణాలను వారు పంపిణీ చేశారు. మండలంలో పెనికేరు, జొన్నాడ పశు వైద్యాధికారులు భానుప్రసాద్, వినోద్‌కుమార్‌ల అధ్వర్యంలో రైతులకు దాణాను అందించారు.

ఆధునికీకరణకు నోచుకోని పుంతరోడ్లు

● ఇబ్బందులు పడుతున్న రైతులు

రావులపాలెం, మే 23(ఆంధ్రజ్యోతి): రైతుల వ్యవసాయోత్పత్తులు తరలించుకోవడంతోపాటు నిత్యం రాకపోకలు సాగించే కాలువగట్టు, పుంతగట్టు రోడ్లు ఛిద్రమవ్వడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రావులపాలెం మండలంలోని కాలువగట్లు, పుంత గట్టురోడ్లు పూర్తిగా ఛిద్రమై అస్తవ్యస్థంగా తయారయ్యాయి. గత వైసీపీ ఐదేళ్ళ పాలనలో ఆధునికీకరణ చేపట్టకపోవడంతో అధ్వానంగా మారి కూటమి ప్రభుత్వంపై ఆశలతో రైతులు అభివృద్ధి జరుగుతుందని ఎదురుచూస్తున్నారు. గతంలో మార్కెట్‌యార్డు నిధుల నుంచి ఈ పుంత రోడ్లు ఆధుని కీకరణ చేపట్టేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో ఆ రహదారుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది.



గోపాలపురం- ముమ్మిడివరప్పాడు, ఈతకోట పంటపొలాలకు వెళ్లే పుంత రోడ్లు ఛిద్రమైన దృశ్యం

యోగాతో బహుళ ప్రయోజనాలు

● ప్రభుత్వ ఉద్యోగులకు యోగా శిక్షణా తరగతులు



శిక్షణా తరగతులలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజు

ఆలమూరు, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు మానసిక వత్తిడి నుంచి రక్షణ పొందేందుకు యోగాపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా ఆలమూరులో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఈ శిక్షణా తరగతులు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో ఎ.రాజు మాట్లాడుతూ ఉద్యోగులు అనేక వత్తిడులతో ఉండటంవల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని వీటినుంచి యోగా ప్రతీరోజు చేయడంవల్ల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. అన్ని ప్రభుత్వశాఖల ఉద్యోగులకు యోగాపై శిక్షణఇస్తామని చెప్పారు. యోగావల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, అందువలన ప్రతిఒక్కరూ విధిగా యోగాపై శిక్షణ పొందాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో అప్పాజీ, మండల పరిషత్ ఏవో మెహర్‌ప్రకాష్, పీఈటీ సత్తిబాబు, ఎంపీటీసీ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ఆత్రేయపురం, మే23(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వానపల్లి కల్యాణ్ వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. శుక్రవారం మాజీ సమితి అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కల్యాణ్‌కు ఎమ్మెల్యే తనయుడు సంజీవ్ పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలతో స్వాగతిస్తున్న దృశ్యం



హసన్‌బాదలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

హసన్‌బాదలో తిరంగా యాత్ర

ద్రాక్షారామ, మే 23(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాదలో భారత సైన్యానికి మద్దతుగా సిందూర్ విజయోత్సవం పురస్కరించుకుని తిరంగా యాత్ర నిర్వహించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో జాతీయ జెండాలచేతపట్టి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, బీజేపీ నాయకులు దొంతంశెట్టి ఓంప్రకాష్, జనసేన నాయకులు చింతపల్లి సతీష్, గ్రామపెద్దలు చిగురుపాటి బుల్లిరాజు, చోడిశెట్టి వీరభద్రరావు, బొల్లం సత్తిరాజు, వార్డు సభ్యులు సీహెచ్ పాండు, పంచాయతీ కార్యదర్శి కాశి రాకేష్‌కుమార్, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు

కపిలేశ్వరపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా కొన్నినెలలుగా నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించామని ఆలమూరు ఎక్సైజ్ ఎస్ఐ పి.రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కోరుమిల్లిలో గ్రామసర్పంచ్ ఆచంట సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన సారా రహిత గ్రామంగా ప్రకటించారు. గత ఏడాదికాలంగా గ్రామంలో ఒక్క నాటుసారా కేసు నమోదు కాలేదని తెలిపారు. గ్రామకార్యదర్శి, సర్పంచ్, ఎంపీటీసీ, స్థానిక మహిళా పోలీస్, గ్రామ వీఆర్‌వోలతో కూడిన సారా నిర్మూలన కమిటీ సహకారంతో కోరుమిల్లి గ్రామం సంపూర్ణ సారా రహిత గ్రా మంలో నమోదు అయ్యిందన్నారు గ్రామకార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ కోరుమిల్లి గ్రామాన్ని సారా రహిత గ్రా మంగా ప్రకటించడం సంతోషదాయకమన్నారు. ఎంపీటీసీ సుంకరవెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ రామతులసి, వార్డుసభ్యుడు ఏసుదాసు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.